ఆదివారం
10-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 168
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

దానిష్ అలీపై బీఎస్పీ వేటు

న్యూఢిల్లీ: బహుజన్ సమాజ్ పార్టీ ఎంపీ దానిష్ అలీని ఆ పార్టీ సస్పెండ్ చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంతో ఆయనపై చర్యలు తీసుకుంది. అనేకసార్లు హెచ్చరించినా ఆయన తీరు మారకపోవడంతో సస్పెండ్ చేస్తున్నట్లు బీఎస్పీ ప్రధాన కార్యదర్శి సతీశ్ చంద్ర మిశ్రా శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. బీజేపీ ఎంపీ రమేశ్ బిధూడీ అభ్యంతరకర వ్యాఖ్యలతో దానిష్ అలీ వివాదంలో చిక్కుకోగా విపక్ష పార్టీ నేతలు ఆయనకు అండగా నిలిచారు. రాహుల్ గాంధీ సంఘీభావం ప్రకటించారు. తాజాగా మహువా సస్పెన్షన్‌ను దానిష్ అలీ తీవ్రంగా వ్యతిరేకించిన విషయం విదితమే.

ఎన్నికల నోటిఫికేషన్లు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ యువత, నిరుద్యోగులను మభ్యపెట్టడానికి జగన్ సర్కార్ గ్రూప్-1, 2 నోటిఫికేషన్లు విడుదల చేసింది. వయోపరిమితిపై స్పష్టత ఇవ్వకుండా నిరుద్యోగులను గందరగోళంలో పడేసింది. కేవలం ఎన్నికల్లో లబ్ధికోసమే నోటిఫికేషన్లు విడుదల చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. నాలుగున్నరేళ్లుగా నిరుద్యోగులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు హడావుడి చేస్తోంది. దీనిని యువత ఏమాత్రం నమ్మే పరిస్థితి కనిపించడం లేదు.

- వయోపరిమితిపై స్పష్టత కరువు
- గ్రూప్-2కు 21లోగా వెబ్‌సైట్‌లో సమాచారం
- గ్రూప్-1కు జనవరి 1లోగా నిర్ణయం
- రాబోయే కేబినేట్‌లో స్పష్టత
- అభ్యర్థుల అయోమయం

ఏపీపీఎస్సీ డొల్లతనం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల్లో లబ్ధికోసమే జగన్ ప్రభుత్వం గ్రూప్-1, 2 నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) జారీజేసిన గ్రూప్-1, 2 పరీక్షల నోటిఫికేషన్లలో వయోపరిమితి అంశాన్ని ప్రస్తావించకపోవడం అభ్యర్థులను అయోమయానికి గురిచేస్తోంది. ఆయా పోస్టులకు వయోపరిమితి ఎంత ఉండాలనేది స్పష్టం చేయలేదు. అభ్యర్థులు వేచి చూడాలన్న దిశగా నోటిఫికేషన్లలో కమిషన్ సమాచారం ఇచ్చింది. ఎన్నికల ముందు హడావుడిగా నోటిఫికేషన్లు జారీజేసి డొల్లతనం చూపిందన్న విమర్శలున్నాయి. గ్రూప్-1 నోటిఫికేషన్‌లో ఏడో నియమావళిలో జనవరి 1లోగా ఆయా పోస్టులకు అభ్యర్థుల వయోపరిమితిని, విద్యార్హతలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అందుబాటులో ఉంచుతామని ఏపీపీఎస్సీ స్పష్టంచేసింది. గ్రూప్-2 పోస్టులకు సైతం అభ్యర్థుల వయోపరిమితి, విద్యార్హతల వివరాలను ఈనెల 21వ తేదీలోగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని వెల్లడించింది. వయోపరిమితి సాధారణంగానే ఉంటుందా? లేక సడలిస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. వయోపరిమితి మించిపోయిన అభ్యర్థులు ప్రిపరేషన్‌కు సన్నద్ధమవ్వాలా? లేక విరమించుకోవాలా? అనే విషయం తేల్చుకోలేకపోతున్నారు. గ్రూప్-2 పోస్టులకు ఈనెల 21వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. గ్రూప్ 1 పోస్టులకు జనవరి 1 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఉంటుంది. గ్రూప్-1, గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షల తేదీలనూ ఖరారు చేశారు. గ్రూప్-1కు మార్చి 17న ప్రిలిమినరీ నిర్వస్తారు. గ్రూప్-2కు ఫిబ్రవరి 25న షెడ్యూలు ఖరారు

- మిగతా 2 లో

నేడో, రేపో సీఎంల ఎంపిక

అసమ్మతిని అధిగమించేందుకు కాషాయ పార్టీ కసరత్తు
మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్‌పై ప్రక్రియ ముమ్మరం
తరలివెళ్లిన పరిశీలకులు

భోపాల్/రాయ్‌పూర్/జైపూర్: మూడు రాష్ట్రాలకు సీఎంల ఎంపికపై కాషాయ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి పదవికి ఆశావహుల సంఖ్య అధికంగానే ఉండటంతో పార్టీలో అసమ్మతి సెగలను అధిగమించేందుకు బీజేపీ సీఎంల ఎంపిక ప్రక్రియకు ఉపక్రమించింది. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీల ఎన్నికల ఫలితాలు వెలువడి ఇప్పటికే వారం రోజులు గడుస్తోంది. అత్యంత క్రమశిక్షణ గల పార్టీగా చెప్పుకునే బీజేపీ...సీఎంల ఎంపికపై ఇంత సమయం తీసుకోవడంపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఆ పార్టీలో కలవరమూ నెలకొంది. దీంతో మూడు రాష్ట్రాలకు నియమితులైన పార్టీ పరిశీలకులు ఆదివారం నుంచి రంగంలోకి దిగనున్నారు. మధ్యప్రదేశ్ విషయానికొస్తే, పార్టీ ఎమ్మెల్యేలతో పరిశీలకులు సమావేశమవుతారు. కొత్తగా ఎన్నికయిన 163 మంది బీజేపీ శాసనసభ్యులు సోమవారం సమావేశమై కేంద్ర పరిశీలకుల సమక్షంలో తమ నాయకుడిని ఎన్నుకోవడంతో మధ్యప్రదేశ్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠకు తెరపడే అవకాశం ఉందని పార్టీ నేతలు తెలిపారు. 'హరియానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు కె.లక్ష్మణ్, దాని కార్యదర్శి ఆషా లక్రా మధ్యప్రదేశ్‌లోని పార్టీ శాసనసభా పక్ష నాయకుడిని ఎన్నుకోవడం కోసం కేంద్ర పరిశీలకులుగా ఉన్నారు. 'కేంద్ర పరిశీలకులు సోమవారం పార్టీ ఎమ్మెల్యేల సమావేశానికి అధ్యక్షత వహిస్తారు' అని బీజేపీ రాష్ట్ర మీడియా విభాగం అధ్యక్షుడు అగర్వాల్ శనివారం పీటీఐకి తెలిపారు. ముందుగా ఆదివారం ఈ సమావేశం జరగాల్సి ఉండగా, సోమవారం సాయంత్రం 5 లేదా రాత్రి 7 గంటల మధ్య ఎప్పుడైనా జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. నర్సింగ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికై కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన

- మిగతా 2 లో

గాల్లో తిరిగితే రైతు సమస్యలు తెలుస్తాయా?

సీఎం జగన్‌పై చంద్రబాబు ధ్వజం
బాపట్ల, పర్చూరు నియోజకవర్గాల్లో పర్యటన

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: పంటలు పండించే రైతు కష్టాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏమాత్రం పట్టించుకోవడం లేదని, గాల్లో హెలికాప్టర్‌లో తిరిగితే రైతు సమస్యలను ఎలా తెలుస్తాయని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్వజమెత్తారు. మిచౌంగ్ తుపాను ధాటికి పంటలు నష్టపోయిన రైతులను చంద్రబాబు శనివారం రెండోరోజు పరామర్శించారు. శుక్రవారం పర్యటన అనంతరం బాపట్ల టీడీపీ కార్యాలయంలో బసచేసిన చంద్రబాబు శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బాపట్ల, ప్రకాశం జిల్లాల ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలతో ప్రత్యేకంగా సమావేశమై అనేక అంశాలపై చర్చించారు. అనంతరం బాపట్ల పట్టణంలోని

- మిగతా 2 లో

కరువు, తుపానుపై నిర్లక్ష్యం

- ఆదుకోని రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్రం తక్షణం రూ.1000 కోట్లు ఇవ్వాలి
- రేపు జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు
- 14న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు
- సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయం

విశాలాంధ్ర-విజయవాడ: మిచౌంగ్ తుపాను, కరువు నష్టాలపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని అఖిలపక్షాల నేతలు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తుపాను, కరువు నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి రాష్ట్రానికి తక్షణ సాయంగా వెయ్యి కోట్లు, పూర్తిసాయంగా రూ.10 వేల కోట్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ దాసరి భవన్‌లో శనివారం జరిగిన సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షత వహించారు. మెట్ట ప్రాంత రైతులు కరువుతో, ఆయకట్టు ప్రాంత రైతులు తుపానుతో తీవ్ర ఇక్కట్లకు గురయ్యారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, కరువు, తుపాన్ వల్ల నష్టపోయిన రైతులు, వ్యవసాయ కార్మికులు, వరద బాధితులను ఆదుకోవాలని, పంటనష్టాలు అంచనా వేయించి, రైతులకు పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు. ముందుగా రామకృష్ణ మాట్లాడుతూ తుపాను, కరువు నష్టాన్ని కేంద్రం జాతీయ విపత్తుగా గుర్తించి రాష్ట్రానికి రూ.1000 కోట్లు తక్షణ సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల ఎకరాలకుపైగా అపార నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం మాత్రం 1.47 లక్షల హెక్టార్లలో మాత్రమే పంటనష్టం జరిగినట్లు ప్రకటించటం దారుణమన్నారు. అన్నమయ్య జిల్లా మొదలుకుని శ్రీకాకుళం జిల్లా వరకు తీర ప్రాంత జిల్లాల్లో లక్షలాది ఎకరాల పంటలు నీటమునిగాయని

- మిగతా 2 లో

మూడు, నాలుగు వారాల్లో తెర! 2లో

ఇదీ లోకం!

వాళ్ళ కష్టాలు చూస్తే గుండె తరుక్కుపోతోందయ్యా అందుకే దగ్గరకెళ్లి ఓదార్చలేను, పద పోదాం!

మంత్రులకు శాఖల కేటాయింపు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గం కొలువు దీరగా శాఖల కేటాయింపు శనివారం పూర్తి అయింది. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. హోం, పురపాలక, ఎస్సీ, ఎస్టీ సంక్షేమంతో పాటు మంత్రులకు కేటాయించని ఇతర శాఖలను సీఎం రేవంత్ రెడ్డి తన వద్దే అట్టిపెట్టుకున్నారు. భట్టి విక్రమార్కకు ఆర్థిక, ఇంధన శాఖ, తుమ్మల నాగేశ్వరరావుకు వ్యవసాయం, చేనేత శాఖలు, జూపల్లి కృష్ణారావుకు ఎక్సైజ్, పర్యాటకం,

ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటి పారుదల, పౌరసరఫరాలు, దామోదర రాజనర్సింహకు వైద్య, ఆరోగ్య శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి - ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ,

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు - ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ, పొన్నం ప్రభాకర్ రవాణా, బీసీ సంక్షేమం, సీతక్కకు పంచాయతీ రాజ్, మహిళ, శిశు సంక్షేమం, కొండాసురేఖ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖలను కేటాయించారు.

దళితులపై దాష్టీకాలు

- గిరిజనులపైనా దాడులు
- అగ్రస్థానంలో యూపీ, ఎంపీ
- తర్వాతి స్థానాల్లో రాజస్థాన్, బీహార్
- బీజేపీ పాలిత రాష్ట్రాలపై ఎన్‌సీఆర్‌బీ నివేదిక

న్యూఢిల్లీ: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, గిరిజనులపై దాష్టీకాలు పెరిగిపోయాయి. ఈ విషయాన్ని స్వయంగా ఎన్‌సీఆర్‌బీ వెల్లడించింది. దళితులు, గిరిజనులపై నేరాలు-ఘోరాలు పేట్రేగిపోతున్నాయి. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా నేరాలు నమోదవుతున్నాయి. ఎస్సీ, ఎస్టీలపై దురాగతాల జాబితాలో ఈ రెండు రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నట్లు జాతీయ నేరాల నమోదు బ్యూరో (ఎన్‌సీఆర్బీ) నివేదించింది. యోగి ఆదిత్యనాథ్ పాలనలో ఉత్తరప్రదేశ్‌లో గతేడాది షెడ్యూల్డ్ కులాలపై 15,368 నేరాలు జరిగాయి. ఆ తర్వాత స్థానాల్లో రాజస్థాన్ (8,752), మధ్యప్రదేశ్ (7,733), బీహార్ (6,509) ఉన్నాయి. దేశవ్యాప్తంగా గతేడాది దళితులపై 57,428 నేరాలు జరిగితే 2021లో 50,744, 2020లో 50,202 నేరాలు చోటుచేసుకున్నాయి. శివరాజ్ సింగ్ చౌహాన్ హయాంలో

- మిగతా 2 లో

నేడు రాజేంద్రన్ అంత్యక్రియలు

ఆత్మీయుడిని కోల్పోయా: నారాయణ

కొచ్చి: సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు, కేరళ రాష్ట్ర కార్యదర్శి కణం రాజేంద్రన్ అంత్యక్రియలు ఆదివారం జరగనున్నాయి. ఆయన భౌతికకాయాన్ని శనివారం తిరువనంతపురంలో సీపీఐ కేంద్ర కార్యాలయం పీఎస్ స్మారకంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, సీపీఐ కార్యదర్శి వినయ్ విశ్వం, ఎంపీ సంతోశ్ కుమార్ సహా అనేకమంది నాయకులు ఆయనకు నివాళులర్పించారు. అనంతరం రాజేంద్రన్ భౌతికకాయాన్ని స్వస్థలమైన కొట్టాయంలోని వజ్హూర్‌కు తరలించారు. ఎంసీ రోడ్డు మీదుగా కొల్లం, అదూర్, చెంగనూర్, చెంగనసెర్రీ గుండా భౌతికకాయాన్ని బస్సులో తరలించారు. కొట్టాయంలోని సీపీఐ జిల్లా కమిటీ కార్యాలయంలో కొదిసేపు ప్రజల సందర్శనార్థం ఉంచి రాత్రికి వజ్హూర్‌కు చేర్చారు. అంతిమ సంస్కారాలు ఆదివారం ఉదయం 11 గంటలకు కణం ఇంటి వద్ద జరగనున్నాయి. అయితే కణం రాజేంద్రన్ కడచూపు కోసం ప్రతి గ్రామం, పట్టణంలో అభిమానాలు బారులు తీరారు. అభిమాన నాయకుడికి బరువెక్కిన హృదయాలతో తుది వీడ్కోలు పలికారు. రాజేంద్రన్ భౌతికకాయంతో పాటు ఆయన తనయుడు సందీప్, మనుమడు, మంత్రి పి.ప్రసాద్, సీపీఐ కార్యదర్శి కె.నారాయణ, ఉన్నారు. ఆత్మీయుడిని కోల్పోయానని నారాయణ భావోద్వేగానికి గురయ్యారు. రాజేంద్రన్ కమ్యూనిస్టు యోధుడని, ఎల్డీఎఫ్

- మిగతా 2 లో

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ

అమెరికాలో ర్యాలీలు - బ్లింకెన్ ఇంటి ఎదుట నిరసన - వీధుల్లోకి వచ్చిన వేలాది మంది

న్యూయార్క్: పలస్తీనాకు మద్దతుగా అమెరికావ్యాప్తంగా నిరసనలు, ప్రదర్శనలు జరిగాయి. వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి పలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలిపారు. గాజాలో తక్షణమే కాల్పులను విరమించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ దురాక్రమణను ఆపాలని, ఆ దేశానికి మద్దతివ్వొద్దని అమెరికా యంత్రాంగానికి పిలుపునిచ్చారు. అలాస్కా నుంచి ఫ్లోరిడా వరకు నిరసన ప్రదర్శనలు పెద్దఎత్తున జరిగాయి. 'షట్ ఇట్ డౌన్ ఫర్ పలస్తీన్' నినాదాలు మార్మోగాయి. పలస్తీనియన్ యూత్ మూవ్‌మెంట్, ది ఆన్సర్ కోయిలేషన్, నేషనల్ స్టూడెంట్స్ ఫర్ జస్టిస్ ఇన్ పలస్తీనా పిలుపుమేరకు ఈ నిరసన కార్యక్రమాలు జరిగాయి. గాజాలో మారణహోమాన్ని ఆపాలని, కాల్పుల విరమణ కోసం ఇజ్రాయిల్, అమెరికాపై ఒత్తిడి తేవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఉదయాన్నే వర్జీనియా, మెక్‌లీన్‌లోని విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ ఇంటి వద్దకు చేరుకున్న ప్రదర్శనకారులు 'బ్లింకెన్, బ్లింకెన్ రైస్ అండ్ షైన్, యూ ఆర్ కమిటింగ్ జీనోసైడ్!' (బ్లింకెన్, మేల్కొనండి. మీరు మారణహోమం సృష్టిస్తున్నారు) అని నినాదాలు చేశారు. న్యూయార్క్‌లో ఫోలేస్క్వేర్, సిటీ హాల్, స్టాక్ ఎక్స్ఛేంజ్ వద్ద ప్రదర్శనలు జరిగాయి. వాషింగ్టన్ స్క్వేర్ పార్కు వరకు ర్యాలీలు/మార్చ్‌లు నిర్వహించారు. పలస్తీనా మేధావి రఫాత్ అలారీర్ ఇజ్రాయిల్ దాడుల్లో ప్రాణాలు కోల్పోవడంపై నిరసన తీవ్రస్థాయిలో వ్యక్తమైంది. 'ఈ పాలకులకు న్యాయం, సంఘీభావం, శాంతి అంటే తెలియదు. చాలా వరకు ప్రజలతో వీరికి సంబంధాలు లేవు. కారణం గాజాపై పోరునకు ఇజ్రాయిల్‌కు మద్దతిస్తూ మారణహోమం సృష్టించడం. దేశ ప్రజలు కాల్పుల విరమణను కోరుతున్నారు' అని నిరసనకారులు తెలిపారు. లాస్ ఏంజిల్స్‌లో హాల్మీ పార్కు వద్ద ర్యాలీలో 'జీనోసైడ్ జో' (ఊచకోత కోస్తున్న జో) అన్న నినాదాలు వినిపించాయి. అక్కడి బైడెన్ ఫండ్‌రైజర్ బయట భారీ ప్రదర్శన నిర్వహించారు. ఇజ్రాయిల్ దురాక్రమణకు పలస్తీనియన్లు అంతం పలికినప్పుడు ప్రపంచంలోనే అధికంగా హింసను పోషించే అమెరికా ప్రభుత్వాన్ని గద్దె దించడం మన బాధ్యత' అని 'పార్టీ ఫర్ సోషలిజం, లిబరేషన్' పిలుపునిచ్చింది. ఫిలడెల్ఫియాలోని కామ్‌కాస్ట్, చికాగోలోని బోయింగ్‌తో సహా ఇజ్రాయిల్‌కు మద్దతిస్తున్న కార్పొరేషన్ల వద్ద నిరసనలు జరిగాయి. పిల్లలపై బాంబు దాడులు ఆపండి. తక్షణమే కాల్పులను విరమించండి' అని రోడే ద్వీపంలోని టెక్స్‌టన్ కార్యాలయం వద్ద నిరసనకారులు నినదించారు. పిట్స్‌బర్గ్, పెన్సెల్వేనియాలోనూ భారీ ప్రదర్శనలు జరిగాయి.

మూడు, నాలుగు వారాల్లో తెర!

గాజాపై భీకర పోరునకు ముగింపు పలికే యోచనలో ఇజ్రాయిల్

జెరూసలేం/న్యూయార్క్: ఇజ్రాయిల్-హమాస్ మధ్య భీకరపోరు సాగుతోంది. తక్షణమే కాల్పుల విరమణకు సర్వత్రా డిమాండ్ పెరుగుతోంది. కానీ అవేమీ ఇజ్రాయిల్‌కు పట్టడం లేదు. హమాస్ అంతమే లక్ష్యమని సమర్థించుకుంటోంది. పిల్లలు, మహిళలు, నిస్సహాయ ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ దాడులను తీవ్రతరం చేస్తూనే ఉంది. ఉత్తర గాజా శిథిలం కాగా దక్షిణ గాజా, ఖాన్ యూనిస్‌లో విచ్చలవిడిగా వైమానిక, భూతల దాడులను ఇజ్రాయిల్ జరుపుతోంది. అయితే దక్షిణ గాజాలోని ఖాన్ యూనియన్‌లో సైనిక చర్యలకు ముగింపు పలకాలని ఇజ్రాయిల్ భావిస్తోందని తెలిసింది. మరో మూడు లేక నాలుగు వారాల్లో భీకర పోరు ముగించవచ్చని ఇజ్రాయిల్ రక్షణ శాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పినట్లు యాక్సియస్ వార్తా సంస్థ నివేదించింది. ఖాన్ యూనియన్‌లో ఆపరేషన్ ఆరంభ దశలోనే ఉన్నదని, హమాస్ నాయకత్వం ఇక్కడే ఉన్నట్లు ఇజ్రాయిల్ సైన్యం నమ్మిందని ఆ అధికారి చెప్పారని పేర్కొంది. ఇజ్రాయిల్-హమాస్ మధ్య భీకర దాడుల దశ మరో మూడు లేక నాలుగు వారాల్లో ముగుస్తుందని సంకేతాలు వెలువడినట్లు వెల్లడించింది. అయితే దురాక్రమణను ఆపేందుకు ఇజ్రాయిల్‌కు అమెరికా కచ్చితమైన డెడ్‌లైన్ విధించలేదు కానీ సమయం పరిమితంగా ఉందని, సాధ్యమైనంత త్వరగా తక్కువ ప్రాణ నష్టంతో సైనిక చర్యలను ముగించాలని మాత్రం సూచించింది. డిసెంబరు చివరికి గాజా స్ట్రిప్‌లో ఆపరేషన్‌ను ఇజ్రాయిల్ ముగించాలన్నది వాషింగ్టన్ సూచన కాగా జనవరి చివరికి ముగింపు పలకాలన్నది ఇజ్రాయిల్ లక్ష్యమని తెలిసింది. ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) గాజా స్ట్రిప్‌లో భూతల దాడుల మూడవ దశ మొదలైనట్లు ఇజ్రాయిలీ జనరల్ స్టాఫ్ హెర్జి హలేవీ అధిపతి ప్రకటించడం విదితమే. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడులలో 17,700 మంది పలస్తీనియన్లు చనిపోయారు.

గాజాపై ఐరాస భద్రతా మండలి తీర్మానం- వీటో చేసిన అమెరికా

గాజాలో తక్షణమే కాల్పులు విరమణ కోసం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి చేసిన డిమాండ్‌పై అమెరికా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు భద్రతా మండలి చేసిన తీర్మానానికి వ్యతిరేకంగా తన వీటో అధికారాన్ని వినియోగించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రతిపాదించిన ముసాయిదాకు 13 అనుకూల ఓట్లు వచ్చాయి. బ్రిటన్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. గాజాలో మానవతా సంక్షోభ నివారణ కోసం ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ తనకున్న అసాధారణ అధికారాన్ని వినియోగించిన విషయం విదితమే. గాజాలో మానవతా విపత్తుకు దారితీయొద్దు అని పిలుపునిచ్చారు. ఈ పరిస్థితి నివారణకుగాను ఆయన ఐరాస ఛార్టర్‌లోని ఆర్టికల్ 99ను ప్రకారం భద్రతా మండలిని సమావేశపర్చారు. ఇదే క్రమంలో ఐరాస భద్రతా మండలి కాల్పుల విరమణకు ప్రతిపాదనపై ఓటింగ్ నిర్వహించింది.

భద్రతా మండలిలో మొత్తం 15 సభ్యదేశాలు ఉన్నాయి. ప్రతిపాదనకు 13 అనుకూల ఓట్లు రాగా శాశ్వత సభ్యదేశమైన అమెరికా తన వీటో అధికారంతో తీర్మానాన్ని అడ్డుకుంది. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు కాల్పుల విరమణను తీవ్రంగా వ్యతిరేకించాయి. అది హమాస్ పుంజుకుంటుందని వాదించాయి. గాజా పౌరుల రక్షణ, బందీల విడుదల కోసం స్వల్ప విరామాలకు అమెరికా అనుకూలంగా ఉంది. ఐరాస భద్రతా మండలి తీర్మానం వాస్తవికతకు దూరంగా ఉండటం వల్ల క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రభావం చూపబోదని అమెరికా ప్రతినిధి రాబర్ట్ ఉడ్ అన్నారు. ఇజ్రాయిల్, పలస్తీనా ప్రజలు శాంతి-భద్రతల మధ్య జీవించాలన్నది అమెరికా ఆకాంక్షగా చెప్పారు. ప్రస్తుత అస్థిర పరిస్థితుల్లో కాల్పుల విరమణకు అంగీకరిస్తే హమాస్ మరోసారి రెచ్చిపోయేందుకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఈ ముసాయిదా తీర్మానాన్ని సవరించాలని సూచించారు.

నేడు రాజేంద్రన్ అంత్యక్రియలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లో మిచౌంగ్ తుపాను బాధితులను పరామర్శించేందుకు తిరుపతి, నెల్లూరు జిల్లాల పర్యటనలో ఉన్నప్పుడు రాజేంద్రన్ మృతివార్త అందిందని, వెంటనే త్రివేంద్రం చేరుకున్నట్లు చెప్పారు. రాజేంద్రన్ భౌతికకాయంతో పాటు ప్రయాణించడం చాలా బాధగా ఉందన్నారు. తన ప్రేమ పాత్రుడు, ఆత్మీయుడు కణం రాజేంద్రన్ అంతిమ యాత్రలో పాల్గొనాల్సి రావడం కలచివేస్తోందని నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

కణం రాజేంద్రన్ మృతికి సీపీఐ సంతాపం

న్యూఢిల్లీ: సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి కణం రాజేంద్రన్ ఆకస్మిక మరణం కమ్యూనిస్టు, ప్రగతిశీల ఉద్యమానికి తీరని లోటని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శివర్గం పేర్కొంది. రాజేంద్రన్ మృతికి సంతాపాన్ని ప్రకటించింది. 73ఏళ్ల రాజేంద్రన్ అనారోగ్యంతో కొంతకాలంగా ఆసుపత్రిలో ఉంటూ తీవ్ర గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని శనివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది. తన జీవితాన్ని పార్టీకి, ప్రజలకు సేవ చేశారని, వామపక్షాల ఐక్యతకు నిర్విరామంగా పనిచేశారని రాజేంద్రన్‌ను కొనియాడింది. కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం విజయానికి ఎంతగానో తోడ్పడినట్లు తెలిపింది. కమ్యూనిస్టు ఉద్యమానికి, ప్రజలకు చేసిన సేవలకుగాను కణం రాజేంద్రన్ చిరస్మరణీయుడని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం పేర్కొంది.

దళితులపై దాష్టీకాలు

(మొదటిపేజీ తరువాయి)

మధ్యప్రదేశ్‌లో షెడ్యూల్డ్ తెగలపై అత్యధిక నేరాలు నమోదయ్యాయి. 2020-22లో ఎస్టీలపై నేరాల్లో మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. గతేడాది 2,979 నేరాలు ఇదే రాష్ట్రంలో నమోదయ్యాయి. ఆ తర్వాత స్థానాల్లో 2,521, 773 చొప్పున రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాలు ఉన్నాయి. 2021లో గిరిజనులపై 2,627 నేరాలు, 2020లో 2,401 నేరాలు మధ్యప్రదేశ్‌లో జరిగాయి. ఉత్తరప్రదేశ్ మాజీ డీజీపీ మాట్లాడుతూ దళితులు, ఎస్టీలపై ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో మళ్లీ మళ్లీ జరిగిన నేరాలను ఎన్‌సీఆర్‌బీ డేటా పొందుపర్చిందని అన్నారు. ఈ రెండు వర్గాల సంక్షేమానికి చర్యలు తీసుకున్నట్లు పాలకపక్షం నిత్యం చెబుతుంది కానీ తరచూ వీరిపై నేరాలు నిశబ్దంగానే జరుగుతుంటాయన్నారు. గిరిజనుడు దష్మేశ్ రావత్‌పై ప్రవేశ్ శుక్లా అనే వ్యక్తి మూత్రవిసర్జన చేసిన వీడియో ఈ ఏడాది జులైలో హల్‌చల్ చేసింది. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఈ ఘటన దేశ ప్రజలకు ఆగ్రహం తెప్పించింది. సర్వత్రా విమర్శలు వచ్చాయి. దీంతో సీఎం చౌహాన్ తన అధికారిక నివాసానికి బాధితుడిని ఆహ్వానించి, ఆయన కాళ్లు కడిగి క్షమాపణ చెప్పారు.

ఇదిలావుంటే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే మాట్లాడుతూ మోదీ హయాంలో దళితులు, గిరిజనులపై దురాగతాలు పెరిగాయన్నారు. సమాజాన్ని విభజించే బీజేపీ అజెండాలో ఇది భాగమని వ్యాఖ్యానించారు. ఎక్స్ మాధ్యమంగా స్పందిస్తూ '2013 నుంచి దళితులపై నేరాల్లో 46.11 శాతం పెంపుదల ఉంటే ఆదివాసీలపై నేరాలు 48.15 శాతం మేర పెరిగాయి. దళితులు, ఆదివాసీ ప్రజలను తరచూ అణచివేస్తున్న వైనం బీజేపీ-ఆర్‌ఎస్ఎస్ 'సమ్మిళిత' వ్యాఖ్యల్లోని కపటత్వాన్ని... సబ్ కా సాథ్‌లోని డొల్లతనాన్ని బహిర్గతం చేస్తుంది' అని విమర్శించారు. 'ఎన్‌సీఆర్బీ తాజా గణాంకాలు కేవలం అంకెలు మాత్రమే కాదు. అవి బీజేపీ చీకటి పాలనలో ఎస్సీ-ఎస్టీలకు రక్షణ లేదనేందుకు రుజువు. వారికి అన్యాయం జరుగుతోందనేందుకు ఆధారం. దురాగతాలు, అణచివేత వంటివి దశాబ్దంగా పేట్రేగిపోయాయి. ఇవి బీజేపీ విభజన రాజకీయ అజెండాలో భాగమే' అని ఖడ్గే పేర్కొన్నారు.

బీఆర్ఎస్ఎల్పీ నేతగా కేసీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: బీఆర్ఎస్ఎల్పీ నేతగా కె.చంద్రశేఖరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్పీ నేత కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేసీఆర్ ఎన్నిక జరిగింది.కేసీఆర్ పేరును పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రతిపాదించగా మాజీ మంత్రులు శ్రీనివాస్ యాదవ్, కడియం శ్రీహరి మద్దతిచ్చారు. బీఆర్ఎస్ఎల్పీ నేతగా పార్టీ అధినేత కేసీఆర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాసనసభాపక్షం మిగతా కమిటీని ఎంపిక చేసే బాధ్యతను ఆయనకు అప్పగిస్తూ సమావేశం తీర్మానించింది.

కరువు, తుపానుపై నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. నష్టపోయిన పంటలను గుర్తించి అక్రమాలు జరగకుండా ఎన్యూమరేషన్ చేయాలని, కౌలు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధితో పాటు రైతుసంఘాల బాధ్యులతో ఎన్యూమరేషన్ కమిటీ వేయాలని సూచించారు.

మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సాగునీటి వినియోగంపై అవగాహనలేని వారు ముఖ్యమంత్రిగా, నీటపారుదల శాఖ మంత్రులుగా ఉండటం వల్ల ఈ దరిద్ర్యం వచ్చిందన్నారు. పులిచింతల, పట్టిసీమ నీళ్లు వాడుకోవటం ఈ ప్రభుత్వానికి చేతకాలేదన్నారు. సీఎం జగన్ నిర్వాహకం వల్ల శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అధీనంలోకి వెళ్లాయన్నారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ పంట కాల్వకు, డ్రైనేజీ కాల్వకు తేడా తెలియని ముఖ్యమంత్రి ఉండటం వల్ల పంట పొలాల్లో మురుగునీరు చేరుతోందన్నారు. పొలాల్లో నీళ్లు నిలబడకుండా పంటకాల్వలను ఆధునీకరించి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒడ్డున ఉండి పరిశీస్తే నష్టపోయిన రైతుకు ధైర్యం రాదన్నారు. కౌలు రైతుల నుంచి యజమానులు ముందుగానే డబ్బు తీసుకున్నారని, కౌలురైతులను ఒత్తిడి చేయకుండా కౌలు తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. జనసేన రాష్ట్ర నాయకులు రామ్మోహనరావు మాట్లాడుతూ కరువు, తుపాను వల్ల జరిగిన నష్టాన్ని ప్రభుత్వం తక్కువ చేసి చూపిస్తోందన్నారు. రాష్ట్రంలో 3వేల మంది కౌలు రైతులు ఉన్నారని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని కోరారు. ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు జీఎస్ ఫణిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ అంశమైనా, పాలనాపరమైన అంశమైనా స్పందించే ప్రభుత్వ సలహాదారు సజ్జల

రామకృష్ణారెడ్డి కరువు, తుపాను నష్టంపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఏపీ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.కోటేశ్వరరావు మాట్లాడుతూ చెట్లు కూలిపోయిన, పంట నష్టపోయిన పండ్లతోటల రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు డి.హరనాథ్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు ఖాదర్‌బాషా, ఆర్ఎస్‌పీ రాష్ట్ర నాయకులు రవికాంత్, తెలుగు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడి శ్రీనివాసరెడ్డి, రైతుసంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, అఖిలభారత రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి వెంకటరెడ్డి, రైతుకూలీ సంఘం నాయకులు వీరబాబు, రైతు సంఘం నాయకులు చెరుకూరి రాజేశ్, వెగలపూడి ఆజాద్, సాగునీటి సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణారావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. ముందుగా పంట నష్టాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకున్న రైతులకు రౌండ్‌టేబుల్ సమావేశం సంతాపం ప్రకటించింది. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పది డిమాండ్‌లతో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 11వ తేదీన అన్ని జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, 14వ తేదీన కలెక్టరేట్ల ముందు నిరసనలు తెలిపాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయించింది. మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి టి.తాతయ్య, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, రాజకీయ పార్టీల నేతలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతు కూలీ సంఘాలు, సాగునీటి సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీపీఐ నాయకులు, రైతు సంఘాలు తుపానుతో నష్టపోయిన పంట పొలాలను, కరువుతో నష్టపోయిన పొలాలను పరిశీలించిన ఫొటోలు, తడిసి మొలకలెత్తిన, రంగు మారిన, కుళ్లిపోయిన వివిధ రకాల పంట మొక్కలను తీసుకువచ్చి రైతాంగం కష్టాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-అమరావతి : అగ్రిగోల్డ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి, వారిని ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా, అమరావతిలో శనివారం ఏర్పాటు చేసిన అగ్రిగోల్డ్ బాధితుల సత్యాగ్రహ దీక్ష శిబిరంలో ముప్పాళ్ల ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయకపోవడం అగ్రిగోల్డ్ బాధితులను నమ్మించి మోసం చేయటమేనని విమర్శించారు. తొమ్మిదేళ్ల నుంచి అగ్రిగోల్డ్ అసోసియేషన్, సీపీఐ అధ్వర్యంలో ఉద్యమాన్ని నిర్వహిస్తూ బాధితుల పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తామని నమ్మబలికి అధికారం చేపట్టిన తర్వాత ఏరు దాటి తెప్ప తగలేసిన చందంగా సీఎం జగన్ తీరు ఉందన్నారు. దీన్ని సభ్య సమాజం వ్యతిరేకించాలన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీ మూతపడటంతో బాధితులు గుండె ఆగి మరణించిన 142 మందికి ఎక్స్‌గ్రేషియాగా రూ.5 లక్షలు చొప్పున గత ప్రభుత్వంలో ఇప్పించామన్నారు. అయితే అధికారంలోకి రాగానే వారం రోజుల్లో రూ.1,182 కోట్లను, ఆరు నెలల్లో మిగిలిన వారికి వడ్డీతో సహా

ఇప్పిస్తాననడంతో అగ్రిగోల్డ్ బాధితులు నమ్మి ఓట్లు వేస్తే గద్దెనెక్కిన తర్వాత జగన్‌మోహన్ రెడ్డి మాటమార్చారని విమర్శించారు. అగ్రిగోల్డ్ బాధితులు సుమారు 40 లక్షల మంది ఉన్నారని, వీరు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సమాయత్తం అవుతున్నారని ముప్పాళ్ల అన్నారు. మోసపోయిన అగ్రిగోల్డ్ బాధితులు, మరణించిన బాధిత కుటుంబాలతో విజయవాడ ధర్నా చౌక్ దగ్గర 30 గంటల పాటు దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లా కేంద్రాలలో కలెక్టర్ కార్యాలయాల వద్ద ప్రదర్శన నిర్వహించి, స్పందన కార్యక్రమంలో అర్జీలు అందజేస్తామని తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులు ప్రతి ఒక్కరూ ఆయా కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. సత్యాగ్రహ దీక్షకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన తెలుగుదేశం రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి కన్నదార వసంతరావు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గంటా గోపి, సీపీఎం కార్యదర్శి సూరిబాబు, తెలుగుదేశం బీసీ విభాగం నాయకులు మద్దిరాల గంగాధర్, చెన్నకేశవ ప్రసంగించారు. ఈ దీక్షకు సీపీఐ ఏరియా కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ, కేతినేని అగస్టీన్, కరిముల్లా, పోతుగంటి నాగేశ్వరరావు, కె.చెన్నకేశవరావు, జాతీయ చేనేత సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు చిల్లపల్లి సత్యం, అనుమోలు వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

నేడో, రేపో సీఎంల ఎంపిక

(మొదటిపేజీ తరువాయి)

లోధీ వర్గానికి చెందిన ప్రహ్లాద్ పటేల్ సీఎం రేసులో ముందంజలో ఉండవచ్చు. ఇక దిమాని నుంచి ఎన్నికై కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన నరేంద్ర తోమర్ పేరు సీఎం పదవి కోసం ప్రచారంలో ఉంది. అలాగే, పార్టీ ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయవర్గియా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వి.డి.శర్మ ఇతర అభ్యర్థుల్లో ఉన్నారు.

చత్తీస్‌గఢ్‌లో నేడు సీఎల్పీ సమావేశం

చత్తీస్‌గఢ్‌లో బీజేపీ నుంచి కొత్తగా ఎన్నికయిన 54 మంది ఎమ్మెల్యేల సమావేశం ఆదివారం జరగనున్నది. శాసనసభా పక్ష నేతను ఎన్నుకుంటారు. ఈ భేటీ తర్వాత ముఖ్యమంత్రి ఎవరన్న ఉత్కంఠకు తెరపడే అవకాశం ఉంది. గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాషాయ పార్టీ తన ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించలేదు. ఈ సమావేశానికి పార్టీ ముగ్గురు పరిశీలకులు అర్జున్ ముండా, సర్బానంద సోనోవాల్, పార్టీ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ గౌతమ్ హాజరవుతారని ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అరుణ్ సావో శనివారం విలేకరులకు తెలిపారు. బీజేపీ చత్తీస్‌గఢ్ ఇన్‌ఛార్జ్ ఓం మాథుర్, కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియా, రాష్ట్ర పార్టీ కో-ఇన్‌ఛార్జ్ నితిన్ నబిన్ కూడా హాజరవుతారని ఆయన తెలిపారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన పార్టీ ప్రముఖుడు రమణ్‌సింగ్‌ను ఎన్నుకోకపోతే, బీజేపీ ఓబీసీ లేదా గిరిజన ముఖ్యమంత్రి కోసం వెళుతుందని ఊహాగానాలు వెలువడుతున్నాయి. కేంద్ర మాజీ మంత్రి విష్ణుదేవ్, ఎమ్మెల్యేగా ఎన్నికై కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన రేణుకా సింగ్, రాష్ట్ర మాజీ మంత్రులు రాంవిచార్ నేతమ్, లతా ఉసేంది, అసెంబ్లీకి ఎన్నికైన తర్వాత ఎంపీ పదవికి రాజీనామా చేసిన గోమతి సాయి గిరిజన సమాజం నుంచి సీఎం పదవి రేసులో ఉన్నారు.

రాజస్థాన్‌లో కొనసాగుతున్న గందరగోళం

రాజస్థాన్‌లో సీఎం ఎంపికపై బీజేపీలో తీవ్ర గందరగోళమే నెలకొంది. పార్టీ అధిష్టానం రాష్ట్ర నాయకులతో తీవ్ర మంతనాలు జరుపుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవి విషయంలో తన గురించి వస్తున్న చర్చలను పట్టించుకోవద్దని బీజేపీ ఎమ్మెల్యే బాలక్‌నాథ్ శనివారం ప్రజలను కోరారు. తాను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మరింత అనుభవం సంపాదించాల్సి ఉందని బాలక్‌నాథ్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆయనతో పాటు ముఖ్యమంత్రి పదవికి మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, అర్జున్ మేఘ్వాల్, దియా కుమారి పేర్లు ఉన్నాయి. సీఎం అభ్యర్థిని ప్రకటించేందుకు రాజస్థాన్‌లో ఎన్నికయిన శాసనసభ్యులతో సమావేశం నిర్వహించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో పరిశీలకులను బీజేపీ నియమించింది.

రైతు సమస్యలు తెలుస్తాయా?

(మొదటిపేజీ తరువాయి)

3వ వార్డులో వరద ముంపులో ఉన్న యానాదుల కాలనీలో గల ఇళ్లను పరిశీలించి...సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు 100 నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు బాపట్ల టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ ప్రకటించారు. అనంతరం కంకటపాలెం చేరుకున్న చంద్రబాబుకు గ్రామస్తులు గజమాలతో స్వాగతం పలికారు. నరసాయపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండ వేసి నివాళు లర్పించారు. పర్చూరు నియోజకవర్గంలోకి ప్రవేశించిన చంద్రబాబుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఘనస్వాగతం పలికారు. చెరుకూరులో నీట మునిగిన పొగాకు, మిర్చి పంటలు పరిశీలించి రైతు సమస్యలు తెలుసుకున్నారు.

అనంతరం బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో మురుగు కాలువల్లో పూడిక తీయకపోవటం వల్లే పొలాలు వరద ముంపునకు గురయ్యాయని విమర్శించారు. పంటలు నష్టపోయిన రైతుల ఆత్మహత్యలకు ముఖ్యమంత్రి జగన్ కారణమన్నారు. రాష్ట్రంలో రహదారులు దెబ్బతిన్నాయని, అందుకే ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో తిరుగుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టుల గేట్లకు మరమ్మతులు చేయలేని ముఖ్యమంత్రి...మూడు రాజధానులు ఎలా కడతారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తప్పుడు ప్రచారంతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వరద బాధితులకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు విత్తనాలు ఇవ్వలేని ప్రభుత్వం మనకు అవసరమా అని ప్రశ్నించారు. ఎన్నికల వేళ ముద్దులు పెట్టి...తర్వాత పిడిగుద్దులు వేయటంలో జగన్‌మోహన్‌రెడ్డి దిట్ట అని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యం, అహంకారం వల్ల రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానంతో రైతు అప్పుల పాలయ్యాడని చెప్పారు. రైతుల పక్షాన అలుపెరగని న్యాయపోరాటం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. రైతురాజ్యం తీసుకురావటానికి టీడీపీ-జనసేన కలిసి పోటీ చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అరాచక శక్తులు రాజ్యమేలుతున్నప్పుడు ప్రజలంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ ప్రభుత్వం కక్షసాధింపునకు పాల్పడుతోందని, అయినా ప్రజల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని తెలిపారు. తుపాను ప్రభావంతో నష్టపోయిన చెరుకూరుకు చెందిన మిర్చి రైతు గద్దం శ్రీనివాసరావుకు రూ.2 లక్షల ఆర్థికసాయం చంద్రబాబు ప్రకటించారు. మూడు నెలల్లో అధికారంలోకి రాబోతున్నామని, ధైర్యం కోల్పోవద్దని భరోసా ఇచ్చారు. చంద్రబాబు వెంట మాజీమంత్రి నక్కా ఆనందబాబు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎంపీ మాల్యాద్రి, చీరాల ఇన్‌చార్జి కొండయ్య, సంతనూతలపాడు ఇన్‌చార్జి విజయ్‌కుమార్, బుచ్చయ్య చౌదరి తదితరులు ఉన్నారు.

ఎన్ని'కల' నోటిఫికేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఆయా నోటిఫికేషన్లకు దరఖాస్తుల ప్రక్రియ నుంచి ప్రిలిమినరీ పరీక్షల షెడ్యూలును ప్రకటించి... వయోపరిమితి అంశాన్ని విస్మరించడంపై సర్వత్రా విమర్శలున్నాయి. సాధారణంగా ఏపీపీఎస్సీ ప్రకటించే నోటిఫికేషన్లలో పోస్టుల వివరాలు, విద్యార్హతలు, రోస్టర్ పాయింట్లతోపాటు వయోపరిమితి అంశాన్ని స్పష్టంగా పేర్కొంటారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో భర్తీ చేసే ఉద్యోగాలకుగాను జనరల్ అభ్యర్థులకు 42 ఏళ్లలోపు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ అంశాన్ని తాజాగా విడుదల చేసిన గ్రూప్-1, 2 పోస్టుల్లో అసలు వయోపరిమితి అంశాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. ఉద్యోగ నోటిఫికేషన్లు జారీజేసి, అందులో వయోపరిమితి వివరాలు లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. గ్రూప్-1, 2 ఉద్యోగాలకుగాను జనరల్ అభ్యర్థులకు 42 ఏళ్ల నుంచి 47 ఏళ్ల వరకు అదనంగా పెంచాలని నిరుద్యోగ, యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కేబినెట్‌పైనే నిరుద్యోగుల ఆశలు

ఈనెల 14వ తేదీన నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో గ్రూప్-1, గ్రూప్-2తో పాటు ఇతర ఉద్యోగాలకు వయోపరిమితిపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అటు తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో సీఎం జగన్ పర్యటిస్తూ బిజీబిజీగా ఉన్నారు. ఎన్నికల దగ్గర పడటంతో అధికారులు హడావుడిగా నోటిఫికేషన్లు జారీజేశారు. వయోపరిమితి అంశాన్ని ప్రస్తావించకుండా నోటిఫికేషన్లు జారీజేయడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేబినెట్ భేటీ అనంతరం వయోపరిమితిపై ప్రభుత్వం నుంచి తీపి కబురు వస్తుందని ఆశిస్తున్నారు. ఈనెల 7వ తేదీన గ్రూప్-2, 8వ తేదీన గ్రూప్-1 నోటిఫికేషన్లను ఏపీపీఎస్సీ జారీజేసింది. ఈ మొత్తం పోస్టులకు ప్రిలిమినరీ పరీక్షలను వరుస వారీగా షెడ్యూలు విడుదలతో అభ్యర్థులు గందరగోళానికి గురవుతున్నారు. ఒకేసారి గ్రూప్-1, 2 షెడ్యూలు విడుదల చేయడంతో ప్రిపరేషన్‌కు ఆటంకం ఏర్పడుతుందని వాపోతున్నారు. గ్రూప్-1 ప్రిపరేషన్‌కు కనీసం నాలుగైదు నెలల వ్యవధి ఉండాలని, గ్రూప్ 2కు అంతే సమయం ఉండాలని కోరుతున్నారు. ఎన్నికల షెడ్యూలు రాకముందే గ్రూప్-1, 2 నోటిఫికేషన్లు విడుదలైనందున పరీక్షల నిర్వహణకు ఎలాంటి అడ్డంకులు ఉండబోవని అధికారులు చెబుతున్నారు. ప్రిలిమ్స్ పరీక్షలు పూర్తయ్యాక మెయిన్స్ పరీక్షల నిర్వహణ, నియామకాల ప్రక్రియ పూర్తవ్వడానికి మరో నాలుగైదు నెలల సమయం పడుతుంది. ఎన్నికల ముందు గ్రూప్‌ల నోటిఫికేషన్లు ఇచ్చి, నిరుద్యోగుల ప్రిపరేషన్‌కు సమయం లేకుండా చేసిందని, ఇది కేవలం ఎన్నికల లబ్ధి కోసమేనని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

త్వరలో డీఎస్సీపైనా స్పష్టత

నాలుగున్నరేళ్ల నుంచి గ్రామీణ నిరుద్యోగులు ఎదురుచూస్తున్న డీఎస్సీ పోస్టులపైనా రాబోయే కేబినెట్‌లో స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది. సీఎం జగన్ ఇచ్చిన హామీల్లో భాగంగా మెగా డీఎస్సీకి ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఖాళీల వివరాలు సేకరించే పనిలో విద్యాశాఖాధికారులు నిమగ్నమయ్యారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పదవీ విరమణ చేసిన ఎస్జీటీ ఉపాధ్యాయుల ఖాళీల వివరాలను ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం. దీని ఆధారంగా త్వరలో డీఎస్సీ ప్రకటన ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. గ్రూప్-1, 2 నోటిఫికేషన్లకు ప్రభుత్వం ఆదేశించింది. వెంటనే డీఎస్సీపైనా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. డిసెంబరులోగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుంటే తరువాత ఇవ్వడం కష్టమేనని భావిస్తున్నారు. నోటిఫికేషన్ వచ్చిన 45 రోజుల్లోగా పరీక్షలు నిర్వహించాలి. అంటే జనవరి చివరిలోగాని, ఫిబ్రవరిలోగాని పరీక్షలు ఉంటాయి. ఇంతవరకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను నిర్వహించలేదు. టెట్ నిర్వహించాకే డీఎస్సీ ఇవ్వాలి. ప్రస్తుతం సమయం లేనందున టెట్ కమ్ టీఆర్టీకి ఒకే పరీక్ష నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. సీఎం జగన్ స్పందించి తక్షణమే జంబో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ప్రైవేటీకరణ విధానాలు తిప్పికొట్టాలి

కార్మిక సంఘాలు సంఘటితంగా పోరాడాలి: రావుల రవీంద్రనాథ్

విశాలాంధ్ర-ఏలూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను తిప్పి కొట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ శనివారం సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జరిగింది. రామచంద్రరావు పేట శ్రీవెంకటేశ్వర స్వామి గుడి వద్ద నుంచి ఏఐటీయూసీ సభా ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా 'ఏఐటీయూసీ జిందాబాద్, సమాన పనికి సమాన వేతనం, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని, మోదీ డౌన్ డౌన్' నినాదాలు మారుమ్రోగాయి. అనంతరం ఏలూరు జిల్లా కార్యాలయం వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని నగర అధ్యక్షుడు కృష్ణమాచార్యులు ఆవిష్కరించారు. ప్రథమ మహాసభ అధ్యక్ష వర్గంగా ఆర్ఎస్ డాంగే, చాట్ల పుల్లారావు, కరీమ్ ఉన్నారు. ముఖ్య అతిథిగా రావులపల్లి రవీంద్రనాథ్ హాజరయ్యారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ఓడరేవులు, రైల్వే, బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, బొగ్గు తదితర సంస్థలను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేయాలని చూడటం సిగ్గుచేటని రవీంద్రనాథ్ అన్నారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఏఐటీయూసీపై ఉందన్నారు. కార్మిక వర్గం ప్రత్యేక బాధ్యత తీసుకొని ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలని, అన్ని ప్రజా సంఘాలలో ఏఐటీయూసీ విస్తరించే విధంగా క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులను నిలువు దోపిడీ చేసే విధానాలు అనుసరిస్తుందని విమర్శించారు. కార్మిక వర్గానికి ఏలూరు జిల్లాలో ఘనచరిత్ర ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ కార్మికులపై నిరంకుశ విధానాలు అవలంభిస్తున్నారని, కనీస వేతనాల బోర్డు ఏర్పాటులో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కార్మిక చట్టాలను పరిరక్షించుకోవడానికి ఐక్య పోరాటాల చేయాలని పిలుపునిచ్చారు. బలమైన శక్తిగా ఏఐటీయసీ ఎదగాలని ఆకాంక్షించారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు సంతాప తీర్మాన్ని ప్రవేశపెట్టారు. వక్తల్లో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కృష్ణమాచార్యులు, తోర్లపాటి బాబు తదితరులున్నారు. ప్రజానాట్యమండలి నాయకులు తమ్మా విశ్వేశ్వరరావు ఆలపించిన విప్లవ గేయాలు అలరించాయి. ఏఐటీయూసీ నేతలు ఎ.అప్పలరాజు, పుప్పాల కన్నబాబు, కె.విగ్నేశ్, భజత్రీ శ్రీనివాసరావు, కంకిపాటి బుచ్చిబాబు, డీఎల్ మూరి పాల్గొన్నారు.

15 మందికి డీస్పీలుగా పదోన్నతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో 15 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన వారి వివరాలను డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి వెల్లడించారు. సీహెచ్ ఎస్ఆర్ కోటేశ్వరరావు (ఏసీబీ), కొంపల్లి వెంకటేశ్వరరావు(విజిలెన్స్ ఎన్ఫోర్సుమెంటు), టీవీ రాధాస్వామి(ఎస్బీ), డి.శ్రీహరిరావు(ఏసీబీ), జి.రాజేంద్రప్రసాద్ (ఇంటిలిజెన్స్) పదోన్నతి పొందారు. బి.పార్థసారథి (సీఎస్బీ), కె.రసూల్ సాహెబ్ (సీఐడీ), ఎం.కిషోర్ బాబు (విజిలెన్స్- ఎన్ఫోర్స్మెంట్), డీఎస్వీ ప్రసాద్(ఇంటెలిజెన్స్), జి.రత్నరాజు(పోలవరం), పి.రవిబాబు (ఇంటెలిజెన్స్), షేక్ అబ్దుల్ కరీమ్ (పీసీఎస్), ఎస్. తాతారావు (విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్), ఎస్.వహీద్ భాషా (సీఐడీ), ఎం.హనుమంతరావు (సీఐడీ)లకు పదోన్నతి లభించింది.

ఆలోచనాత్మకం 'నేనూ-ఒక కథ'

విశాలాంధ్ర-విశాఖ: విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక మహోత్సవ ప్రాంగణం టర్నర్‌సత్రంలో శనివారం నిర్వహించిన 'నేనూ-ఒక కథ' ఇష్టాగోష్ఠి ఆలోచనను రేకెత్తించింది. అరసం విశాఖ జిల్లా సమితి అధ్వర్యంలో నిర్వహించిన సభను మహిళా చేతన నాయకులు కత్తి పద్మ పర్యవేక్షించారు. రచయితలు కల్లూరి శ్యామల, కేఎన్ మల్లీశ్వరి, అయ్యగారి సీతారత్నం, గూడూరు సీతామహాలక్ష్మి, మహిళా సంఘాల నేతలు లక్ష్మి, లలిత, అన్నపూర్ణ, సాయి పద్మ, మాలిని మాట్లాడుతూ స్పందిస్తూ జీవిత వాస్తవం నుంచి ఉద్భవించిన కథలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. మానవ సంబంధాలు, మహిళలపై సభ్య సమాజంలో లైంగిక వేధింపుల నేపథ్యంలో వారి చైతన్యానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మధుసూదన్, సత్యనారాయణ, రాజు, శ్యామ్‌సుందర్, మేడా మస్తాన్ రెడ్డి పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారంలో విఫలం

ప్రభుత్వాలపై రావుల వెంకయ్య విమర్శ

విశాలాంధ్ర-పత్తికొండ: రైతుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడు రావుల వెంకయ్య విమర్శించారు. కేంద్రప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, వారి సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. నల్ల చట్టాలతో మోసం చేయాలని చూసిందన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండలోని చదువుల రామయ్య భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథంతో కలిసి రావుల వెంకయ్య మాట్లాడారు. మూడు వివాదాస్పద సాగు చట్టాలకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ ఉద్యమంలో 750 మంది చనిపోయారని, మోదీ సర్కార్ మెట్టు దిగి రైతులకు క్షమాపణ చెప్పి నల్లచట్టాలను రద్దు చేసిందని గుర్తుచేశారు. విద్యుత్ సంస్కరణలు, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఖండించారు. ఆంధ్రప్రదేశ్‌లోని జగన్ ప్రభుత్వం విద్యుత్ మీటర్లకు స్మార్ట్‌మీటర్లు పెట్టడాన్ని తప్పుపట్టారు. విద్యుత్ మీటర్లు పగలగొట్టేందుకు ఏఐకేఎస్ జాతీయ సమితి పిలుపు ఇవ్వగా ఉమ్మడి అనంతపురం సత్య సాయి జిల్లాల రైతులు మీటర్లను ధ్వంసం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని లాభాల బాటలో నడిపించేందుకు అఖిలపక్ష రైతు సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి పి. భీమలింగప్ప, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పెద్ద ఈరన్న, ఉమాపతి, గౌరవ అధ్యక్షుడు ఎం. కారన్న, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, సీపీఐ తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్ పాల్గొన్నారు.

నేటి నుంచి విశాలాంధ్ర 23వ పుస్తక మహోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు: విశాలాంధ్ర బుక్ హౌస్ అధ్వర్యంలో గుంటూరు ఏఎల్‌బీఈడీ కళాశాల ఆవరణలో ఈ నెల 10 నుంచి 31వ తేదీ వరకు 23వ పుస్తక మహోత్సవం (పుస్తక ప్రదర్శన) ఏర్పాటు చేసినట్లు అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, విశాలాంధ్ర బుక్ హౌస్ గుంటూరు బ్రాంచ్ మేనేజర్ మురకొండ మల్లిఖార్జునరావు తెలిపారు. స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పుస్తక ప్రదర్శనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ పుస్తక మహోత్సవాన్ని 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రారంభిస్తారన్నారు. అనంతరం విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగే ప్రారంభోత్సవ సభకు విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పుట్టా హరనాథరెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణతో పాటు అనేక మంది ప్రముఖ రచయితలు హాజరుకానున్నట్లు వివరించారు. పుస్తక మహోత్సవంలో 40 రకాల ప్రచురణ సంస్థలు ప్రచురించిన 20 వేల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆర్.కె.నారాయణ్, కుశ్వంత్ సింగ్, మహాత్మాగాంధీ, నెహ్రూ రచనలతో పాటు గురజాడ, శ్రీశ్రీ, నేటి యువ రచయితల దాకా ప్రఖ్యాత రచయితల రచనలు, ఆధ్యాత్మిక, వాస్తు శాస్త్ర గ్రంథాలతో పాటు వైద్య, ఆరోగ్య, ప్రజాదరణ పొందిన సైన్స్ గ్రంథాలు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల కోసం అన్ని రకాల కాంపిటేటివ్, గ్రామర్, రిఫరెన్స్ బుక్స్, తెలుగు అకాడమీ పాఠ్యపుస్తకాలు, రూ.20 నుంచి రూ.1500 వరకు 100 రకాల డిక్షనరీలు కూడా ఉంటాయన్నారు. బాలల సాహిత్యం నుంచి భారతం వరకు, ఫిక్షన్ నుంచి ఫిలాసఫీ వరకు వేలాది రకాల పుస్తకాల విందు ఈ పుస్తక మహోత్సవంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందని, పుస్తకాలపై 10 శాతం రిబేటు ఇవ్వనున్నట్లు తెలిపారు. పుస్తక ప్రియులందరూ కూడా ఈ మహోత్సవానికి విచ్చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరసం అధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు

పుస్తక మహోత్సవం సందర్భంగా అరసం అధ్వర్యంలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక ఆవిష్కరణలు, పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు జరుగుతాయని వారు వెల్లడించారు. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి ఆవంత్స సోమసుందర్ పేరును, సాహిత్య వేదికకు బెల్లంకొండ రామదాసు శత జయంతి వేదికగా నామకరణం చేసినట్లు తెలిపారు.

ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు

రాయలసీమ ప్రాంతీయ సదస్సులో వామనమూర్తి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ఆటో కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని, 21,31 జీవోలను రద్దుచేయాలని ఏపీ ఆటోడ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి వామనమూర్తి డిమాండ్ చేశారు. ఇక్కడి దేవీఫంక్షన్ హాలులో ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ అధ్యక్షతన ఏపీ ఆటోవర్కర్స్ యూనియన్ రాయలసీమ జిల్లాల ప్రాంతీయ సదస్సు శనివారం జరిగింది. వామనమూర్తి మాట్లాడుతూ విద్యార్థులను, కూలీలను, రోగులను, ప్రయాణికులను గమ్యస్థానాలకు ఆటో కార్మికుడేనని చెప్పారు. ఒకప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నిత్యావసర వస్తువులు తరలించేదీ ఆటో కార్మికుడునని గుర్తుచేశారు. రాష్ట్రంలో 5,74,250 ఆటోలు ఉన్నాయని, రోజుకు ఆటోల ద్వారా కోటి మంది ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. సమాజంలో ఆటోకార్మికుడి పాత్ర కీలకమైందన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న ఆటో, కారు, జీపు డ్రైవర్లందరిదీ ఒకటే జాతి అన్నారు. వాహనమిత్ర ద్వారా ప్రభుత్వం ఆటోకార్మికులకు రూ.10 వేలు ఇస్తూ అంతకుమించి జరిమానాలు, పెట్రోలు, డీజిలు ద్వారా గుంజుకుంటుందని విమర్శించారు. ఆటో కార్మికులు ప్రైవేట్ అప్పులవారి వేధింపులు భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆత్మహత్యలకు పాల్పడవద్దని, మన సమస్యలు, హక్కుల కోసం పోరాడదామని వామనమూర్తి ఆటో కార్మికులకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 150 జీఓ వెనక్కి తీసుకునేలా సమిష్టిగా పోరాడామని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం 21, 31 జీవోలతో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఆ జీఓలు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రమాదవశాత్తు కార్మికుడు మృతిచెందితే అతని కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కార్మికులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని, ఆటో స్టాండ్‌కు ప్రభుత్వమే స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలు పునిచ్చారు. ఆటోవర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రవాణా రంగ కార్మికులతో చెలగాట మాడుతున్నాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వలన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌ల ద్వారా కార్మికులకు రుణాలు ఇచ్చేవారని, వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటన్నింటినీ రద్దు చేసిందని చెప్పారు. ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు. అంతకుముందు సీపీఐ కేరళ రాష్ట్రకార్యదర్శి కణం రాజేంద్రన్, ఏఐటీయూసీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మృతికి సదస్సు సంతాపం తెలిపింది. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, అన్నమయ్య జిల్లా కార్యదర్శి సాంబశివుడు, ఆటో వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా కార్యదర్శి శివ, నాయకులు అనుమతి భాష, రవి, రాజు, ఏఐటీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి, ఏఐటీయూసీ కడప డిప్యూటీ కార్యదర్శి మద్దిలేటి, నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటేశ్, జి.చంద్రశేఖర్, ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఏసన్న, బడే సాహెబ్, రాజప్ప, కృష్ణారెడ్డి, రాము, ఈశ్వర్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి కవులు, కళాకారుల పాదయాత్ర

జయప్రదం చేయాలని చంద్రనాయక్ పిలుపు

రాజమహేంద్రవరం: ప్రజల మధ్య సోదర భావం, సమానత్వం, మతసామరస్యం పెంపొందించడం కోసం ప్రజానాట్యమండలి దేశవ్యాపితంగా పాదయాత్ర నిర్వహిస్తుందని, అందులో భాగంగా ఈనెల 18 నుండి 22వ తేదీ వరకు గుంటూరు-విజయవాడ మధ్య కవులు, కళాకారులు పాదయాత్ర చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ చెప్పారు. రాజమండ్రి ఆనం కళాక్షేత్రం ఆవరణలో పాదయాత్ర బ్రోచర్‌ను శనివారం విడుదల చేశారు. అనంతరం చంద్రనాయక్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఈ ఏడాది సెప్టెంబర్ 28న భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ప్రారంభమైన పాదయాత్ర మహాత్మాగాంధీ వర్ధంతి అయిన 2024 జనవరి 30వ తేదీ వరకు కొనసాగుతోందని చెప్పారు. అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజ చైతన్యానికి కళలు, సాహిత్యం కీలకమన్నారు. ప్రజానాట్యమండలి ప్రజాచైతన్యానికి కృషి చేస్తోందని తెలిపారు. దేశంలో భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్నాయని, దేశంలో వివిధ రకాల రుగ్మతలు మానవ సమాజాన్ని వెంటాడుతున్నాయని, దేశాన్ని కాపాడటానికి రచయితలు, కళాకారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ రచయితలు, కళాకారులు పాదయాత్రలో పాల్గొంటారన్నారు. దేశభక్తులు పాల్గొని పాదయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా ప్రజానాట్యమండలి నాయకులు కుమార్, అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజానాట్యమండలి నాయకులు సామ్యేల్, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.



అర్హులందరికీ ప్రయోజనాలే లక్ష్యం

వికసిత్ భారత్ యాత్ర ప్రారంభంలో అశ్వినీ వైష్ణవ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: అర్హులందరికీ లబ్ది చేకూర్చడమే వికసిత్ భారత్ లక్ష్యమని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. విశాఖ నగరపాలక సంస్థ, జోన్-2 జోడిగుళ్లపాలెంలో శనివారం జరిగిన వికసిత భారత సంకల్పయాత్రలో ఆయన పాల్గొన్నారు. సంకల్పయాత్ర రథాన్ని విశాఖ నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటివరకు ఎవరికి లబ్ది చేకూరలేదో అలాంటి వారిని గుర్తించి లబ్ధి చేకూర్చడం భారత సంకల్పయాత్ర ద్వారా జరుగుతుందన్నారు. ఆయన ప్రభుత్వ పథకాల లబ్దిదారులతో మాట్లాడారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ 80 ప్రదేశాలను గుర్తించి రోజుకు రెండు ప్రదేశాలలో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో ప్రభుత్వ పథకాలపై ప్రజాభిప్రాయ సేకరిస్తారన్నారు. తొలుత సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కేంద్రమంత్రి సందర్శించారు. ఎకో వైజాగ్ ప్లాస్టిక్ వినియోగంపై, మలేరియా, డెంగ్యూ వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించే స్టాళ్లతో పాటు జన ఔషధి కేంద్రం, జనరిక్ మందులు, పీఎం స్వానిధి, పోషణ్ అభియాన్, ఆయుష్మాన్ భారత్, ఆధార్ కేంద్రం, ఉజ్వల్ పథకానికి సంబంధించిన స్టాళ్లను సందర్శించారు. 2024 మన సంకల్పం వికసిత భారత్ బ్రోచర్ ఆవిష్కరించారు. బాక్సింగ్‌లో అర్జున అవార్డు పొందిన జయరామిరెడ్డిని సత్కరించారు. అనంతరం అశ్వనీ వైష్ణవ్‌ను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నర్సింహరావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, రైల్వే డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

కోడి రామ్మూర్తి జీవితం స్ఫూర్తిదాయకం

నన్నయ్య వర్సిటీలో జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రారంభించిన మంత్రులు రోజా, చెల్లుబోయిన

విశాలాంధ్ర-రాజానగరం: ప్రముఖ మల్లయోధుడు, క్రీడాకారుడు కోడి రామ్మూర్తి నాయుడు జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఆంధ్రప్రదేశ్ క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. తూర్పు గోదావరి జిల్లా, రాజానగరం మండలంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అధ్యక్షతన జాతీయస్థాయి సౌత్ అండ్ వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా రోజా, విశిష్ట అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ హాజరయ్యారు. ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వెయిట్ లిఫ్టర్లు పోటీల్లో పాల్గొన్నారు. రోజా మాట్లాడుతూ దేశానికి తొలి ఒలింపిక్ పతకాన్ని తెచ్చిన మహిళగా కరణం మల్లేశ్వరి చరిత్రలో నిలిచార న్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారం అందుతోందని తెలిపారు. కరణం మల్లేశ్వరి, మేరీకోమ్ ఆదర్శవంతులని చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ అన్నారు. నన్నయ్య వర్సిటీ స్థాపనకు కృషిచేసిన వైఎస్సార్, జక్కంపూడిని కొనియాడారు. మార్గాని భరత్ మాట్లాడుతూ ఖేలో ఇండియా ప్రాజెక్టు తరపున రూ. 20 కోట్ల నిధి కోసం ప్రతిపాదన పంపితే 8.3 కోట్ల రూపాయలు విడుదలయ్యాయని, వాటితో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధుల్ని సమకూర్చేందుకు యత్నిస్తున్నట్లు చెప్పారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి సహకారంతో నన్నయ్య విశ్వవిద్యాలయాన్ని మోడల్ వర్సిటీగా తయారు చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. సమీపంలోని దివాన్ చెరువులో క్రీడా మైదానం నెలకొల్పే పనిలో ఉన్నామని తెలిపారు. రాజమండ్రి జాయింట్ కలెక్టర్ శ్రీతేజ, ఉపకులతులు ఆచార్య కె.పద్మరాజు, ఆచార్య ప్రసాదరాజు ప్రసంగించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.ధ్యానచంద్ర, సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా గవర్నింగ్ బాడీ సభ్యులు అర్జున అవార్డీ నీలంశెట్టి లక్ష్మీ, వెయిట్ లిఫ్టింగ్ ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలు, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు బడేటి వెంకటరామయ్య పాల్గొన్నారు.

18న కలెక్టరేట్ల ముట్టడి

28,29 తేదీల్లో విజయవాడలో 30గంటల మహాధర్నా

బాధితులకు న్యాయం జరిగే వరకు పోరు: తిరుపతిరావు

విశాలాంధ్ర-తణుకు: అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్ల సొమ్ము చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఇదే డిమాండ్‌తో ఈనెల 18న జిల్లాల్లో కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు వెల్లడించారు. అలాగే 28, 29 తేదీల్లో విజయవాడలో 30 గంటల మహా ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో తమ సమస్య పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ అమలులో జగన్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు దీక్షను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థకు రూ.30వేలకోట్ల విలువైన ఆస్తులున్నాయని, వీటిని ఉపయోగించుకుని బాధితులకు కేవలం రూ.3 వేల కోట్లు ఇచ్చి న్యాయం చేయవలసిన ప్రభుత్వం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోందన్నారు. అగ్రి బాధితులు నలపై లక్షల మంది ఉన్నా ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదని అన్నారు. అగ్రిబాధితులకు న్యాయం చేయని కారణంగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఓడిపోయిందని, జగన్ మాట తప్పితే వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించుతారన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్, కాంగ్రెస్ నేత దిర్శిపో రామకృష్ణ, టీడీపీ నేత తాతపూడి మారుతీరావు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, ఐద్వా నాయకులు ఎ.అజయకుమారి, లాయర్ల సంఘం నాయకుడు కౌరు వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి వై.నాగలక్ష్మి, తణుకు శాఖ కార్యదర్శి నూనె రామశ్రీను, కొండయ్య, సాదే సామ్యేలు రాజు, నాగిరెడ్డి, గోల్డ్ శ్రీనుతో పాటు 50 మంది దీక్షలో పాల్గొన్నారు.

ఏపీలో రాజ్యాంగబద్ధ పాలన లేదు

నిమ్మగడ్డ రమేష్ కుమార్, ఎల్వీ సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్ర ప్రదేశ్‌లో పాలన రాజ్యాంగబద్ధంగా లేదని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ పైశాచికంగా పాలన సాగుతోందని రిటైర్డ్ ఐఏఎస్‌లు నిమ్మగడ్డ రమేష్ కుమార్, ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రతిపక్ష నేతలు, ప్రజాసంఘాలపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. పోలీసు చట్టం సెక్షన్-30 నిబంధనలను నిరవధికంగా పొడిగించడం సరైంది కాదని అన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలపై గృహనిర్బంధాలు ఎక్కువైయ్యాయన్నారు. పోలీసు వ్యవస్థను అధికార పార్టీ దుర్వినియోగం చేస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై నేర కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. రాజ్యాంగ స్ఫూర్తితో, ప్రజాస్వామ్యయుతంగా ప్రభుత్వం పని చేయాలని హితవు పలికారు. అక్రమ కేసులపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ పోరాటం చేస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పని చేయడానికి త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఆ కమిటీలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ డీజీపీగా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి భాస్కరరావు, పూర్వ అడిషనల్ అడ్వకేట్ జనరల్ అనగాని సత్యప్రసాద్, హిందూ దిన పత్రిక విజయవాడ ఎడిషన్ పూర్వ ఎడిటర్ వెంకటేశ్వర్లు వ్యవహరిస్తారన్నారు. తిరుపతి వేదికగా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తామన్నారు. అలాగే ఈనెల 13న విజయవాడ వేదికగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు.

సంపాదకీయం

ఇల్లలికినా పండగ లేదు

అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగిశాయి. ఉత్తరాదిలోని మూడు హిందీ మాట్లాడే రాష్ట్రాలను బీజేపీ దక్కించుకుంది. మధ్యప్రదేశ్‌లో బీజేపీ 18 ఏళ్ల పాలన తరవాత మళ్లీ విజయం సాధించింది. ప్రధానమంత్రి మోదీకి, ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్య సంబంధాలు సవ్యంగా లేవు అనుకున్నా అక్కడా బీజేపీ విజయం సాధించడం చిన్న విషయం ఏం కాదు. రాజస్థాన్‌లో గట్టి పోటీ ఉంటుందనుకున్నారు. అదే రీతిలో పోటీ గట్టిగా జరిగినా బీజేపీ కాంగ్రెస్‌ను గద్దె దించగలిగింది. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ సునాయాసంగా గెలుస్తుంది అనుకుంటే ఆ రాష్ట్రాన్ని బీజేపీ సాధించింది. ఇవన్నీ వ్యవస్థాగతంగా బీజేపీ పటిష్ఠతకు చిహ్నం కావచ్చు. మోదీ ఆకర్షణ శక్తి కావచ్చు. గెలవడానికి కారణం ఏమిటి అన్న అంశం విజయం తరవాత పెద్దగా చర్చకు రాదు. ఓడిన చోట ఆత్మ విమర్శ లాంటివి అవసరం కావచ్చు. కానీ ఎన్నికల ఫలితాలు వెలువడి సరిగ్గా వారం అయింది. కానీ విభిన్నమైన, క్రమశిక్షణగల, ప్రపంచంలోకే అతి పెద్దదైన, బలమైన నాయకత్వంగల బీజేపీ అగ్రనాయకులైన మోదీ-షా ద్వయం తిరుగులేని నాయకులైనా ఈ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఎంపిక చేయడానికి మల్లగుల్లాలు పడ్తున్నారు. దీనికి కారణం ఏమిటి? బీజేపీ చాలా బలమైన పార్టీ అన్న అభిప్రాయం పైపై మెరుగేనా? లేక బీజేపీలో ముఠా తగాదాల కుమ్మరి ఆవం కుతకుతలాడుతోందేమో! ఈ అన్ని ప్రశ్నలకు సమాధానం అవును అని కనక అయితే మోదీ నాయకత్వం అంత పటిష్ఠమైంది కాదనుకోవాలి. స్థానికంగా బలంగా ఉన్న నాయకులను విస్మరిస్తే అసలుకే ముప్పు వస్తుందన్న ఎరుక మోదీ-షా ద్వయానికి ఉండే ఉంటుంది. మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో ఒక్క చోట కూడా ముఖ్యమంత్రి ఎంపిక అంత సులభంగా కనిపించడం లేదు. మూడు రాష్ట్రాలలో బీజేపీ 12 మంది పార్లమెంటు సభ్యులను శాసనసభ ఎన్నికల గోదాలోకి దించింది. వీరంతా గెలిచారు. 14 రోజులలోగా వీరు లోకసభలో కొనసాగుతారో, శాసనసభనే ఎంపిక చేసుకుంటారో తేల్చుకుని ఏదో ఒక దానికి రాజీనామా చేయాలి. వీరందరూ లోకసభకు రాజీనామా చేసేశారు. ప్రధాన మంత్రి మోదీ దర్శనం కూడా చేసుకున్నారు. వీరిని శాసనసభ్యులుగానే కొనసాగించాలని నిర్ణయించడం అంటే వీరికి రాష్ట్ర స్థాయిలో ప్రధాన బాధ్యతనే అప్పగించాలన్న ఆలోచన ఉండవచ్చు. ఈ 12 మందిలో కేంద్ర మంత్రులు కూడా ఉన్నారు. ఈ మూడు రాష్ట్రాలలోనూ బీజేపీ గెలిస్తే ముఖ్యమంత్రి ఎవరవుతారో ప్రకటించలేదు. రాష్ట్ర స్థాయి నాయకులను నిగమ శర్మ అక్కల్లా మిగిల్చేసి కేవలం తన ప్రతిభ కారణంగానే గెలిచినట్టు చాటుకోవడం మోదీకి మహా ఇష్టం. నా మొహం చూసి ఓటు వేయండి అంటారు మోదీ. బీజేపీ ఏ రాష్ట్రంలో పోటీ చేసినా అక్కడ ప్రతిపక్ష నాయకుడికి, అధికారంలో ఉన్న పార్టీ నాయకుడికి, ప్రధానమంత్రి మోదీకి మధ్యే పోటీ జరుగుతుంది. మోదీ ముఖారవిందానికే కమలం గుర్తు కన్నా ఎక్కువ ప్రాధాన్యం.

ఈ మూడు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులను ఎంపిక చేయాలి. లేదా నియమించాలి. మెజారిటీ ఉన్న, లేదా అతి పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ శాసనసభా పక్షం ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారు అన్న సంప్రదాయం రాజకీయాల్లో మోదీ ప్రస్తావనే లేనప్పుడే మాయమైంది. కాంగ్రెస్ లోనైనా, బీజేపీలోనైనా అధిష్ఠానమే ముఖ్యమంత్రిని ఎంపిక చేస్తుంది. శాసనసభా పక్షసమావేశం జరిగినా అది కేవలం తంతు. నాయకుడిని ఎంపిక చేసే బాధ్యతను అధిష్ఠానానికి అప్పగిస్తూ ఓ చిరు తీర్మానం ఆమోదిస్తారు. ఇది ఏకవాక్య తీర్మానంగా ప్రసిద్ధి. వారం దాటినా మూడు రాష్ట్రాలలో కనీసం శాసనసభా పక్షం సమావేశమైనా జరగలేదు. మోదీ కనుసైగల కోసం శాసన సభ్యులు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన గత ఆదివారం నుంచి కేంద్రంలో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. శాసనసభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదర్చడానికి మూడు రాష్ట్రాలకు కేంద్ర పరిశీలకులను పంపించారు. రాజస్థాన్‌కు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు వినోద్ తవాడే, సరోజ్ పాండే, మధ్యప్రదేశ్‌కు హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కె.లక్ష్మణ్, అశోక్ లక్రా, ఛత్తీస్‌గఢ్ కు కేంద్ర మంత్రి అర్జున్ ముండా, సర్బానంద సోనోవాల్, దుష్యంత్ గౌతంను పరిశీలకులుగా పంపారు. వీరు ఏకాభిప్రాయం కుదర్చరు. మోదీ మాటే శాసనసభ్యుల చెవిన వేస్తారు. సాధారణంగా వారంతా తలూపుతారు. నిజానికి ఈ మూడు రాష్ట్రాలలో ముఖ్యమంత్రి కాగలిగిన స్థాయి ఉన్న వారు బీజేపీలో కావలసినంత మంది ఉన్నారు. ఉదాహరణకు రాజస్థాన్‌లో మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే సింధియా, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్, రాజస్థాన్ బీజేపీ అధ్యక్షుడు సీపీ జోషి లాంటి ఉద్దండులున్నారు. కానీ వసుంధరా రాజేను ఆఖరి నిముషం దాకా మోదీ-షా ద్వయం విస్మరించింది. మధ్యప్రదేశ్‌లో 18 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న శివరాజ్ సింగ్ చౌహాన్, ప్రహ్లాద్ సింగ్ పటేల్, జ్యోతిరాదిత్య సింధియా లాంటి మహామహులున్నారు. అయితే శివరాజ్ సింగ్‌ను ఒంటరి వాడిని చేయడానికి మోదీ ఏ అవకాశాన్నీ వదులుకోలేదు. ఛత్తీస్‌గఢ్‌లో మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న డా. రమణ్ సింగ్, అరుణ్ కుమార్ సావు, ధరం లాల్ కౌశిక్, ఒ.పి.చౌదరి లాంటి హేమాహేమీలు ఉన్నారు. రమణ్ సింగ్ పేరు ఎన్నికలకి సిద్ధం అవుతున్న ఆఖరి గడియల్లో తప్ప వినిపించలేదు. అంటే మూడు రాష్ట్రాలలోనూ మాజీ ముఖ్యమంత్రులు మోదీ కంటికి ఆనడం లేదు. అధికారం రుచి మరిగిన తరవాత క్రమశిక్షణకు మారు పేరు అన్న బీజేపీలోనూ ముఠా తగాదాలకు కొదవలేదు. ఈ మూడు రాష్ట్రాలలో కలిపి 65 లోకసభ స్థానాలున్నాయి. 2024లో ఈ సీట్లు బీజేపీకి చాలా ప్రధానం. అందుకే తూనికలు, కొలతలకు అంత ప్రాధాన్యం. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి ఎంపికే కాదు ప్రతిపక్ష నాయకుడి ఎంపిక కూడా బీజేపీకి తలకు మించిన భారం అవుతోంది. ఇటీవల కర్నాటక శాసనసభ ఎన్నికలలో ఓటమి పాలైన తరవాత ప్రతిపక్ష నాయకుడిని ఎన్నుకోవడానికి బీజేపీ అధిష్ఠానానికి ఆరు నెలలు పట్టింది. అక్కడా ఒకటే సమస్య. ఎన్నికలు ముంచుకొచ్చే దాకా అత్యంత శక్తిమంతుడైన నాయకుడు యెడ్యూరప్పను బీజేపీ మూలన కూర్చో పెట్టింది. విధిలేక ఎన్నికల సమయంలో బతిమాలుకున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఎవరుండాలి అన్న విషయంలో శక్తిమంతుడైన బీజేపీ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోశ్‌కు మాజీ ముఖ్యమంత్రి యెడ్యూరప్పకు మధ్య పొంతన కుదర్చడానికి ఆర్నెల్లు పట్టింది. 2017లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడూ బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరినీ ప్రకటించలేదు. అక్కడా మోదీనే అసలు పోటీదారు. యోగీ ఆదిత్యనాథ్ పేరు ఖరారు చేయడానికి కనీసం వారం పట్టింది. ఆదిత్యనాథ్ అప్పటికి ఎమ్మెల్యే కాదు. గోరఖ్ పూర్ నుంచి లోకసభ సభ్యుడిగా ఉండేవారు. మోదీ ఇల్లలికారు. ముగ్గు పెట్టడం వారం రోజులకు కూడా పూర్తి కాలేదు. పండగకు ఇంకెంత సమయం పడ్తుందో చూడాలి.

అందరికీ అభిమానపాత్రుడు రాజేంద్రన్

పి.శ్రీ కుమారన్

భారత కమ్యూనిస్టుపార్టీ కేరళ రాష్ట్ర కార్యదర్శి కనం రాజేంద్రన్ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు. వివిధకాల వ్యాధులతో ఆయనను ఆస్పత్రిలో చేర్చారు. కాలిపై వ్రణమైంది. సుగర్‌వ్యాధి మూలంగా వ్రణం తగ్గలేదు. ఎడమ కాలు కొంతభాగాన్ని తొలగించారు. వ్యాధి నుంచి వేగంగా కోలుకుంటుండగా ఆకస్మికంగా అనేకమార్లు వెంటనే గుండెపోటు రావడంతో శుక్రవారం సాయంత్రం మృతిచెందారు. ఆయన వయస్సు 73ఏళ్లు. సొంతగ్రామంలో ఆయనకు మంచి ఆదరణ ఉంది. ఆరోగ్యం బాగా లేకపోవడంతో పార్టీ నుంచి మూడునెలలు సెలవు తీసుకున్నారు. ఆయన వేగంగా కోలుకుని తిరిగి పార్టీ కార్యకలాపాలలో పాల్గొంటారని ఆశించి రాష్ట్ర పార్టీ కార్యవర్గం మరొకరిని ఎంపిక చేయలేదు. అయితే ఆయన కోలుకుని తిరిగిరాలేదు. ఈలోపే అందరినీ విభ్రాంతి కలిగించే విధానంగా ఆయన మరణం సంభవించింది. వామపక్షాల ఐక్యతకోసం నిరంతరం కృషిచేశారు. రాజేంద్రన్‌లో గొప్ప సుగుణాలు ఉన్నాయి. ఎంతగానో ఇతరులపట్ల ఆదరణగా ఉండేవారు. కొట్టాయం సొంత పట్టణం. ఆయన అనేక అంశాలలో ప్రథమస్థానంలో ఉన్నారు. ఆయన 19ఏళ్ల వయసులోనే 1969లో అఖిల భారత యువజన సమాఖ్య కార్యదర్శిగా పనిచేశారు. 1975లో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు. 1970లో 20 ఏళ్ల వయసు ఉన్నప్పుడే పార్టీ రాష్ట్ర సమితికి ఎన్నికయ్యారు. ఆ తరువాత 25 ఏళ్ల వయసులో కార్యదర్శివర్గానికి ఎన్నికయ్యారు. 2006 నుంచి 2014 వరకు రాజేంద్రన్ ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శిగా ఉన్నారు. 2015 నుంచి తుదిశ్వాస విడిచే వరకు పార్టీ కేరళ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. పార్టీ పోరాట యోధుల్లో గోవిందన్ నాయర్, టీవీ థామస్, సి.అచ్యుత్ మీనన్, ఎన్‌ఈ బలరామ్ తరువాత పార్టీ బాధ్యతలను భుజానికెత్తుకున్నారు. కేరళ రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ సమితికి రాజేంద్రన్ కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఆనేకవిధాలుగా శక్తిస్తోమత మేరకు ఆయన పనిచేశారు. అసంఘటితరంగ కార్మికవర్గం యూనియన్ల కోసం పనిచేశారు. సినిమా చిత్రీకరణ నిర్వహించిన వినయన్‌కు రాజేంద్రన్ అన్ని రకాలుగా మద్దతిచ్చారు. సినిమా పరిశ్రమ స్వప్రయోజనాలను వ్యతిరేకంగా వినయన్‌కు ఎల్లవేళలా మద్దతుగా పనిచేశారు. 1970లో వినయన్ మళయాళం సినిమాలో ప్రముఖ నటుడు తిలకన్ పాత్రపై సినీ సాంకేతిక నిపుణుల అసోసియేషన్ (ఎమ్ఏసీపీఏ) సినీ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారు. ఎన్ఏసీపీఏ విభజన తరువాత ప్రముఖ నటుడు తిలకన్ బదులుగా రాజేంద్రన్ నటించారు. వినయన్‌కి అన్నివిధాలుగా రాజేంద్రన్ సహకరించారు. 1982, 87లలో వజూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి (కొట్టాయం జిల్లా) రాజేంద్రన్ రెండుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1991, 1996లో ఓటమి చెందారు. నిర్మాణకార్మికుల సంక్షేమంకోసం ఆయన ఎంతగానో కృషిచేశారు. నిర్మాణ కార్మికులకు సంబంధించి వారి సంక్షేమంకోసం ఆయన చేసిన కృషి చట్టరూపం దాల్చింది.

ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శిగా ఉన్నప్పుడు అసంఘటిత రంగంలో అనేక యూనియన్లను నిర్మించారు. ఐటీ సెక్టార్‌లో ఆనాటికి ఇష్టానుసారంగా అమలుచేస్తున్న విధానాలను ప్రశ్నించడానికి వీలులేకుండా ఉన్నది. అయితే రాజేంద్రన్ శక్తివంతంగా జోక్యం చేసుకోవడంతో అనేక మంది ఉద్యోగులను రక్షించారు. మొట్టమొదటగా వీధి వీధి తిరిగి అమ్మకాలు చేసే వాళ్లతో ట్రేడ్‌యూనియన్ ఏర్పాటు చేశారు. రాజేంద్రన్ వామపక్షాల ఐక్యతకోసం అవిశ్రాంతంగా పోరాడారు. ఒక సందర్భంలో ఆయన చేసిన కృషిని తప్పనిసరిగా పేర్కొనాలి. 2019లో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్‌ల మధ్య విభేదాలు పొడచూపాయి. అప్పుడు రాజేంద్రన్ జోక్యం చేసుకుని సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకుడు కొడియారి బాలకృష్ణన్‌తో మాట్లాడి ఉద్రిక్తత సడలించారు. కొడియారి బాలకృష్ణన్ అనేక అంశాలమీద విభేదించారు. మళ్లీ విభేదాల తలెత్తకుండా కొడియారి బాలకృష్ణన్ సైతం కృషి చేశారు. వామపక్ష ఐక్యతకు ఎనలేని కృషిచేసిన రాజేంద్రన్‌కు ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాళులర్పించారు. రాజేంద్రన్ అనుసరించిన కార్మిక వర్గ అనుకూలతను, ప్రజాస్వామ్య సంస్థలు, సెక్యులర్ విలువలను పినరయి విజయన్ గుర్తుచేసుకున్నారు. సెక్యులర్, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యతకోసం కృషి చేయవలసిన సందర్భంలో విషాదం జరిగిందని విజయన్ పేర్కొన్నారు. సీపీఐకి సంబంధించి ఆయన మృతి ఎనలేని నష్టం కలిగించిదన్నారు. కీర్తిశేషులైన సీకె చంద్రప్పన్ రాజేంద్రన్‌ను ఎంతగానో అభిమానించారు. రాజేంద్రన్ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని అనేక సందర్భాలలో విమర్శించారు. సీపీఐ పట్ల రాజేంద్రన్ మెతకగా ఉండేవారన్న విమర్శలను ఎదుర్కొన్నారు. సూత్రబద్ధమై రాజకీయాలను

అనుసరించారు. అందరికీ అభిమానవంతుడైన కామ్రేడ్ రాజన్‌కు పార్టీ లాల్‌సలామ్ ప్రకటించింది.

భగవద్గీత, మనుస్మృతులలో సనాతన సారాంశం

డాక్టర్ దేవరాజు మహారాజు

కుల వ్యవస్థను సమర్థించుకోవడానికి బ్రాహ్మణార్యులు భగవద్గీతను ప్రచారంలోకి తెచ్చారు. భగవద్గీత ఒకటవ అధ్యాయంలో అర్జునుడు ఒక సందేహం వెలిబుచ్చాడు. ఈ కురుక్షేత్రం యుద్ధంలో చనిపోయిన వారి భార్యలు చరిత్రహీనులవుతారు. ఎందుకంటే భర్తలు లేనందువల్ల వారు ఇతర కులాల వారితో సంబంధాలు పెట్టుకుంటారు. లేదా, వారిని వివాహం చేసుకుంటారు. వర్ణ సంక్రమణం జరుగుతుంది. సంకరజాతి పిల్లలు పుడతారు. ఇక ఈ కురుక్షేత్ర యుద్ధంలో చనిపోయిన మన వీరులకు పిండాలు పెట్టడానికి వారి పిల్లలు ఉండరు కదా? ఆ విధంగా కులం, ధర్మం, నీతి, నియమం అన్నీ నాశనమవుతాయి కదా?- అన్నది అర్జునుడి సందేహం. కృష్ణుడు దానికి నేరుగా సమాధానమివ్వాలి కదా? విషయాన్ని అటూ ఇటూ తిప్పుతాడు. రెండో అధ్యాయం మూడవ శ్లోకంలో కృష్ణుడు కోపంతో అర్జునుణ్ణి నపుంసకుడా! అని దూషించి, తన కోపాన్ని అదుపులో పెట్టుకుని, మళ్లీ వెంటనే 'నీకు స్వర్గం ప్రాప్తిస్తుందని' ఆశ పెడతాడు. (రెండవ శ్లోకం) రెండో అధ్యాయంలో 23, 24, 25 శ్లోకాలలో కృష్ణుడు ఆత్మ గురించి మాట్లాడుతాడే గాని, సరైన వివరణ ఏమీ ఇవ్వడు. చనిపోయిన తర్వాత ఆత్మ స్వర్గంలో ఎవరితో ఎలా సుఖపడుతుంది? అన్నదానికి జవాబులేదు. మళ్లీ కొత్త శరీరం పొందడానికి కొత్త తల్లిదండ్రులు అవసరమవుతారు కదా? స్వర్గంలో పురుషులకు అప్సరసలుంటే మరి స్త్రీలకు ఏ ఏర్పాట్లున్నాయో కృష్ణుడు చెప్పలేదు. భగవద్గీత రెండో అధ్యాయం 31, 38 శ్లోకాలలో వర్ణ వ్యవస్థను తనే సృజించానని, దాన్ని నిలపడమే తన ధ్యేయమని కృష్ణుడు బలంగా చెపుతాడు. భగవద్గీతలోని 18వ అధ్యాయంలో తను సృజించిన వర్ణ వ్యవస్థను అర్జునుడు అనుసరించాలని ప్రబోధిస్తాడు. కుల నాశనం జరిగితే సనాతన ధర్మం నశించిపోతుందని మనువాదుల భయం. అందుకే అలా రాసిపెట్టుకున్నారు.

నేటి మన ఆధునిక ఆలోచనల ప్రకారం వర్ణవ్యవస్థ, కుల వ్యవస్థ ఎందుకూ పనికిరానివి. మానవత్వాన్ని, ఈ దేశ రాజ్యాంగాన్ని దృష్టిలో పెట్టుకుని మసలుకోవాల్సిందే తప్ప- ఏవో కల్పిత పాత్రలతో మనువాదులు చెప్పించిన వర్ణ వ్యవస్థ, వర్ణసంకరం, జన్మ, పునర్జన్మ, దేవుడి మహిమ వంటి మాటలకు ఎలాంటి విలువా, అర్థమూ లేదు. వైదిక మత ప్రబోధకులు కుట్రపూరితంగా అల్లుకున్న మత గ్రంథాలు ప్రామాణికంకావు. హిందూమతమనే కాదు, ప్రపంచంలోని అన్ని మతాలూ అబద్ధాలే చెప్పాయి. కనుక వాటినన్నింటినీ పక్కకు నెట్టేసి, మానవత్వం నిలుపుకునే దిశలో ఆధునికులమైన మనం, సంయమనంతో ప్రయాణించాల్సి ఉంది. వర్ణ వ్యవస్థను, కుల వ్యవస్థను తనే సృజించానని కల్పిత పాత్ర అయిన ఓ కృష్ణుడితో చెప్పించి, మనువాదులు చేతులు దులుపుకున్నారు. మనుషుల్ని విడగొట్టే ప్రక్రియ భగవద్గీతతో ప్రారంభించి, దాన్ని స్థిరపరిచి, మనుస్మృతిలో వివక్షను తారాస్థాయికి తీసుకెళ్లారు. వివరంగా విశ్లేషించుకుంటూ ఉంటే, అంతా కళ్ల ముందే కదలాడుతుంది. అయితే ఇక్కడ దోషులెవరో స్పష్టంగా తెలుస్తూనే ఉంది. తెలిసినా తెలియనట్టే ఉండడం-దోషులను శిక్షించకుండా వదిలేయడం తెలివిగల పనులేం కావుగదా? మనుస్మృతి రెండవ అధ్యాయం 30వ శ్లోకంలో పది, పన్నెండు రోజుల పిల్లలకు నామకరణం చేయాలని ఉంది. ఇంకా ముందుకు వెళ్లి 31, 32 శ్లోకాలలో ఎవరికి ఎలాంటి పేరు పెట్టాలో సూచించారు. ఉదాహరణకు బ్రాహ్మణ పిల్లలకు ఉన్నతమైన పేర్లు పెట్టాలనీ- శూద్రులకు హీనమైన పేర్లు పెట్టాలనీ అందులో రాసి ఉంది. ఆ పేర్లతో వారు జీవితాంతం దీనుల్లాగా, దాసుల్లాగానే బతకాలి. మధ్యలో కొంత వ్యతిరేకత వచ్చినందువల్ల 'వర్ణం జన్మతో కాదు కర్మతో వస్తుంది'- అని కొత్తపాట పాడారు. ఇదే నిజమైతే బ్రాహ్మణులు పెట్టుకునే పేర్లు శూద్రులను పెట్టుకోనిచ్చారా? లేదుకదా? అలాగే దాసులాంటి శూద్రుల పేర్లు బ్రాహ్మణార్యులు ఎందుకు పెట్టుకోలేదూ? జన్మతో కాదు చేసే కర్మతో ఉచ్ఛం, నీచం ఏర్పడుతాయని ఇంకా కతలెందుకు చెప్తారూ? అంబేద్కర్ చదివినంత చదువు బ్రాహ్మణుల్లో ఎవరూ చదవలేదు. ఆయన చేసిన గొప్ప పనులు ఏ బ్రాహ్మణుడూ చేయలేదు. కర్మతో వర్ణం మారుతుందంటే, అంబేద్కర్ తన కర్మ ఫలితంతో ఉన్నత వర్ణంవాడు కావాలి కదా? కాలేదు ఎందుకూ? విసిగి వేసారి ఆయన హిందూ ధర్మమే వద్దనుకుని, ఆరు లక్షల మందితో బౌద్ధం స్వీకరించాడు- మళ్లీ అది వేరే విషయం.

మనుస్మృతి పదవ అధ్యాయంలో 5-6-66-67-68 శ్లోకాలలో వివక్షకు సంబంధించి మరిన్ని విషయాలున్నాయి. బ్రాహ్మణుడు శూద్రజాతికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే, పుట్టిన పిల్లలు బ్రాహ్మణులే అవుతారు. ఒక శూద్రుడు గనక బ్రాహ్మణ స్త్రీని పెళ్లి చేసుకుంటే పుట్టిన పిల్లలు శూద్రులే అవుతారు. ఈ మాత్రం దానికి వర్ణం జన్మతో వస్తుందని ఓసారి, కర్మతో వస్తుందని మరోసారి చెప్పడం ఎందుకూ? అయినా మహిళలందరినీ శూద్రులుగా పరిగణించిన మనుధర్మ శాస్త్రం చిన్న తర్కం మరిచిపోయింది. ప్రపంచ మానవులందరూ స్త్రీలకు పుట్టినవారే. అంటే శూద్రులకు పుట్టిన వారే. శూద్రుల పిల్లలు శూద్రులే అవుతారు కదా? అలాంటపుడు అందరూ సమానమే. వారి శాస్త్ర ప్రకారం అందరూ శూద్రులే. ఏమైతేనే? తేడాల్లేవ్. ఇక నిచ్చెన మెట్ల వర్ణ వ్యవస్థ ఎక్కడుంటుందీ? మరో విషయం మనుధర్మ శాస్త్రాన్ని వివిధ భాషల్లోకి అనువదించిన మహనీయులందరూ బ్రాహ్మణార్యులే అన్నది మనం గమనించుకోవాలి! ఇంకా మరి కొన్ని వివరాలు చూద్దాం! శూద్రుల పిల్లలకు ఉపనయనం చేసుకునే అర్హత ఉండదు. ఈ కాలంలో ఎవరైనా చేసుకుంటున్నారంటే వారు తమని తాము అగ్రవర్ణం స్థాయికి తీసుకుపోతున్నారని పరాయీకరణ చెందుతున్నారనీ అర్థం. వర్ణవ్యవస్థను రూపొందించడమే కాదు, శతాబ్దాలుగా దాన్ని పరిరక్షించుకునే పనిలో బ్రాహ్మణార్యులు పూర్తిగా నిమగ్నమై ఉన్నారు. అందుకే మన దేశంలో ఒక వ్యక్తి పేరును పూర్తిగా విశ్లేషించుకుంటే అతడి కులం, వర్ణం అన్నీ అర్థమవుతాయి. అలా అర్థమయ్యే విధంగా మనువాదులు డిజైన్ చేశారు. ఉదాహరణకు ఉత్తర భారతదేశంలో వారి పేర్ల చివర ద్వివేది, త్రివేది, చతుర్వేది అనేవి ఉంటుంటాయి. అంటే వారి గురించి వారు గొప్పగా, ఘనంగా ప్రకటించుకోవడమన్న మాట. ద్వివేది- రెండు వేదాలు చదివినవాడు, త్రివేది- మూడు వేదాలు చదివినవాడు. చతుర్వేది- నాలుగు వేదాలు అవుపోసన పట్టినవాడు అని అర్థం. రోజుకు మూడుసార్లు పఠనం చేసేవారు- 'త్రిపాఠి' అని పెట్టుకుంటారు. అలాగే యాగాలు యజ్ఞాలు చేసినవారు 'సోమయాజి' అని పెట్టుకుంటారు. వాళ్ల జీవితమంతా తమ అగ్రవర్ణ స్థానాన్ని ప్రకటించుకోవడంతోనే సరిపోతుంది. ఆ పరిధిలోనే గిరికీలు కొడుతూ కుంచించుకుపోయి ఉంటుంది. ఆధునిక విజ్ఞానశాస్త్రం, గణితం, చరిత్ర అందరికీ అందుబాటులోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారుతూ వచ్చాయి. వేదం, పురాణాలు సంస్కృత భాషా ప్రావీణ్యం, పంచాంగం, జ్యోతిషం, వాస్తు వంటి విషయాలు తెలిసిన వారికి గౌరవమిచ్చారు. కానీ, అది మాత్రమే జ్ఞానం కాదు. అనే విషయం సామాన్య పౌరులు గ్రహిస్తూ వచ్చారు. ఇంకా కొందరు గ్రహించే దశలో ఉన్నారు. గతాన్ని అధ్యయనం చేయడం వల్ల కుట్రలన్నీ వెల్లడయ్యాయి. కుతంత్రాలు బయటపడ్డాయి. మత మౌఢ్యంలోంచి బయటపడి స్వేచ్ఛాలోచనలో జనం విశ్వమానవులుగా ఎదుగుతున్నారు. తాము ఏ కులానికీ, ఏ మతానికీ కట్టుబడిలేమని అధికారికంగా "నో కాస్ట్- నో రిలియజన్"- సర్టిఫికేట్లు తీసుకుని మానవజాతి అంతా ఒక్కటే అని చాటి చెపుతున్నారు. గతంలో జరిగిన పొరపాట్లను ఎత్తి చూపాలన్నదే- ఈ ప్రయత్నం! తప్పితే, ఒక వర్గం వారిని విమర్శించాలని కాదు. శతాబ్దాల క్రితం జరిగిన పొరపాట్లను సరిచేసుకుందామని చెప్పడం తప్ప, సమకాలీనంలో మన జనాభాలో భాగమైన బ్రాహ్మణవర్గం మీద ఉక్రోషం వెళ్లగక్కడం కాదు. శతాబ్దాల క్రితం జరిగిన పొరపాట్లకు సమకాలీనంలోని వారు ఏ విధంగానూ బాధ్యులు కారు కదా? అయితే అవే పాత పద్ధతులు వర్ధిల్లాలని తాపత్రయపడేవారు కొంచెం వారి "మైండ్ సెట్" మార్చుకుంటే బావుంటుంది.

ఒక శూన్యానికి 'దైవం' అని పేరుపెట్టి, దాన్ని జనానికి మత్తుమందులాగా అలవాటు చేసి ఆ తర్వాత- "ఈ భూమి మీద దైవ స్వరూపులు మరెవరో కాదు, బ్రాహ్మణులే"- అని తమ గురించి తామే ప్రకటించుకున్నారు కదా? అంటే ఆ శూన్యంలో తమను తాము ప్రతిష్ఠించుకున్నారు. సామాన్య జనం నమ్మి పూజారిని అపర పరమాత్మ స్వరూపుడనుకునున్నారు. దైవస్తుతిలో ఎవరైనా ఓ కీర్తన పాడితే ఇక ఏకంగా అతణ్ణి దైవ స్వరూపుడన్నారు. అతను చనిపోతే దు- దైవంలో ఐక్యమైపోయాడు అని అన్నారు. ఇన్నిన్ని అభూత కల్పనల మధ్య సామాన్య జనం ఆలోచించలేక, మెదడ్లు మొద్దుబారిపోయి, తరతరాలుగా వాస్తవాలు గ్రహించలేకపోయారు. భ్రమలు తొలగాలంటే జీవ పరిణామం, జన్యుశాస్త్రం, ఖగోళశాస్త్రం గురించి కొంత ప్రాథమిక పరిజ్ఞానమైనా తెలుసుకోవాలి. తెలుసుకుంటే ఇంకా పెంచుకోవాలి. కొందరు గౌరవనీయులైన మూర్ఖులుంటారు. అశాస్త్రీయమైన విషయాలకు శాస్త్రీయ వివరణలివ్వాలని ప్రయత్నిస్తుంటారు. వారిని నిర్దాక్షిణ్యంగా పక్కకు తొలగించుకుంటూ- మానవ జాతి అంతా ఒక్కటే- అందరిదీ ఒకే స్థాయి అని ఎలుగెత్తి చాటుకుంటూ ప్రగతి పథంలోకి కదలాలి. మానవతావాదులుగా గెలవాలి! మానవవాద ప్రపంచానికి రూపకల్పన చేయాలి!!

కేంద్ర సాహిత్య అకాడమీ విజేత, జీవశాస్త్రవేత్త.

కృష్ణవేణి సంగీత నీరాజనం

మానవుని ఆనందం కొరకు సృష్టించిన కళ సంగీతం. ఆదిమ మానవుడు ఆట, మాటతోపాటూ పాటనూ నేర్చుకున్నాడు. ఆ పాట కాలంతో పాటూ రకరకాలుగా రూపాంతరం చెంది సంగీతంగా, ఆ తరువాత వివిధ సంగీత సాంప్రదాయాలుగా పురుడుపోసుకుంది. సంగీతాన్ని ఆస్వాదించలేని వారు జంతువులతో సమానం అన్నారు షేక్స్పియర్. వీణను చూడగానే సరస్వతి, వేణువును చూడగానే కృష్ణుడు, ఢమరుకంను చూడగానే శివుడు గుర్తుకు వస్తారు. భారతీయ సంగీతం రాగ ప్రధానమైనది. పాశ్చాత్య సంగీతం స్వరమేళన ప్రధానం. భారతీయ సంగీతం సామవేదం నుండి ఆవిర్భవించింది. భారతీయ సంగీతం కళాత్మక సంగీతం, నృత్య సంగీతం, గేయ నాటక సంగీతం, నృత్య నాటక సంగీతం, జానపద సంగీతం, పవిత్ర సంగీతంగా అభివృద్ధి చెందింది. భరతముని రచించిన 'నాట్యశాస్త్రం' (క్రీ.పూ.2వ శతాబ్దం నుండి క్రీ.శ.2 వ శతాబ్దం) లో భారతీయ సంగీతం గురించి, సంగీత వాయిద్యాల గురించి వివరించాడు. హిందూ దేవాలయాలో చెక్కిన వివిధ రకాల సంగీత వాయిద్యాలు, సప్త స్వరాలు పలికే స్తంభాలు భారతీయ సంగీత గొప్పదనాన్ని చాటుతున్నాయి. క్రీ.శ.12వ శతాబ్దం మధ్య ఆసియా నుండి వచ్చిన తురుష్కులు, తాతార్లు, పర్షియన్లు, అఫ్ఘాన్లు మన దేశంపై దాడి చేసి అనేక ప్రాంతాలు పాలించారు. ఆ కాలంలోనే భారతీయ సంగీతం ఉత్తర, దక్షిణ సంగీత సాంప్రదాయాలుగా విడిపోయింది. ఉత్తర సాంప్రదాయానికి హిందుస్తానీ సంగీతమని, దక్షిణపు సంప్రదాయానికి కర్ణాటక సంగీతమని పేర్లు వచ్చాయి. భారతదేశంలో తురిష్కి పాలకుడు అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఆస్థానంలో పార్సీ దేశానికి చెందిన అమీర్ ఖుస్రూ ఉండేవాడు. ఎంతో ప్రతిభావంతులు అయిన వీరు పార్సీ సంగీతంలోని రాగ క్రమ పద్ధతిని భారతీయ సంగీతంతో మేళవించి ఒక కొత్త సంగీత సాంప్రదాయాన్ని సృష్టించాడు. అలా ఏర్పడినదే హిందుస్తానీ సంగీతం. ఉత్తర భారతమంతా మహమ్మదీయ పాలనలో ఉండడంవల్ల అక్కడ హిందూస్తానీ సంగీతం ప్రాచుర్యం పొందింది. హిందూస్తానీ సంగీతంలో ఒక రాగాన్ని వినేప్పుడు కలిగే భావనావృత్తి కొన్ని దృశ్యరూపాలతో సంలగ్నమై ఉంటుంది. ఉదా. పంచమ రాగపు చిత్రంలో వర్షంవల్ల కలిగే అహ్లాదాన్ని చిత్రించారు. హిందూస్తానీ సంప్రదాయంలో సూరదాసు, తులసీదాసు, మీరాబాయి వంటివారు భక్తి సంగీతాన్ని కొందరు గజల్స్ రూపంలో శృంగారాన్ని సృష్టించారు.

దక్షిణ భారతదేశంలో పేరు పొందిన భారతీయ సంగీతం కర్ణాటక సంగీతం. 'కర్ణాటిక్' అనే పదానికి సంస్కృత పదం అయిన 'కర్ణేషుఅతతి' (చెవులకు ఇంపైన సంగీతం కనుక కర్ణాటక సంగీతం) మూలం అని పరిశోధకుల అభిప్రాయం. 'కరనాడు' అంటే సముద్ర తీరం అని, మూడు వైపులా సముద్ర తీరం గల దక్షిణ భారతదేశంలో పుట్టిన సంగీతం కనుక దక్షిణ సంగీత సాంప్రదాయానికి కర్ణాటక సంగీతం అనే పేరు వచ్చింది.త్యాగయ్య, శ్యామశాస్త్రి, పురందరదాసు, రామదాసు వంటి వాగ్గేయకారుల పదసాహిత్యము భక్తి కోవకి చెందినది. జావళీలు, ప్రత్యేకించి క్షేత్రయ్య పదాలు శృంగార రసానికి చెందినవి. కర్నాటక సంగీతంలో ప్రధాన లక్షణంగా పరిగణించే రాగం ని పేర్కొన్నది పతంగుడు. 'రాగం' అంటే 'రంగు', 'అనురాగం' అనే అర్థాలున్నాయి. దృశ్య జగత్తులో రంగును చూసినప్పుడు కలిగే ఆనందమే శ్రవ్య జగత్తులో రాగాన్ని విన్నపుడు కలుగుతుంది. రాగాల్లో కొన్ని రాగాలు ఉల్లాసాన్ని, మరికొన్ని రాగాలు విషాదాన్ని, కొన్ని కరుణ రసాన్ని స్ఫురింపజేస్తాయి. కర్ణాటక సంగీతంలో మరో ప్రాధాన్య లక్ష్యం 'శ్రుతి'. 'శృ' (అంటే వినుట) అనే ధాతువునుండి 'శ్రుతి' అనే పదం పుట్టింది. గంటకి నిమిషాలు ఎటువంటివో స్వరానికి 'శ్రుతి' అటువంటిదని సంగీత శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

క్రీ. పూ. 2 వ శతాబ్దంలో భరతముని రచించిన నాట్యశాస్త్రంలో ఆంధ్రులు సంగీత నృత్య ప్రియులు అని పేర్కొన్నారు. సోమనాథుడు పాల్కురికి తన పండితారాధ్య చరిత్రములో వివిధ రకాల వీణలను వివరించాడు. తాళ్లపాక అన్నమాచార్య 15వ శతాబ్దంలో వెంకటేశ్వర స్వామిపై 32,000 భక్తి గీతాలను రచించారు. 14వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యం ఆవిర్భావం శాస్త్రీయ సంగీత సంప్రదాయానికి, తెలుగు భాషకు కొత్త ఆరంభాన్ని తెచ్చిపెట్టింది. విజయనగర ఆస్థాన కవులు (అష్టదిగ్గజాలు) కృష్ణదేవరాయలు స్వయంగా గొప్ప రచయితలు,స్వరకర్తలు. ఈ యుగంలో కూచిపూడి, హరికథ, యక్షగానం, బుర్రకథ, తోలు బొమ్మలాట, వీధి భాగవతంవంటి అనేక సాంప్రదాయ కళలు వికసించాయి. 17 వ శతాబ్దంలో భద్రాచల రామదాసు, రామస్వామి దీక్షితార్ మరింత ప్రసిద్ధి చెందారు. 18వ శతాబ్దంలో కర్ణాటక సంగీత త్రిమూర్తులు శ్యామ శాస్త్రి, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్లు తెలుగులో సంకీర్తనలను స్వరపరిచి ఆలపించారు. "అధ్యాత్మ రామాయణ కీర్తనలు" రచించిన మునిపల్లె సుబ్రహ్మణ్యకవి, "కృష్ణలీలా తరంగిణి" ని రచించిన నారాయణ తీర్థులు ప్రాపకంలోకి వచ్చారు. 19వ శతాబ్దంలో మనంబుచావడి వెంకటసుబ్బయ్యర్, సుబ్బరాయ శాస్త్రి, మైసూరు సదాశివరావు, స్వాతి తిరునాళ్, సుబ్బరామ దీక్షితార్, తిరుపతి నారాయణస్వామి నాయుడు, పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్, రామస్వామి శివన్, మైసూర్ వాసుదేవాచారి, రాంనాథ్ శ్రీనివాస అయ్యంగార్ వంటి ప్రముఖ సంగీత విద్వాంసులు కర్ణాటక సంగీతానికి ఎంతో కృషి చేశారు. సంగీతానికి అలౌకిక శక్తులున్నాయి. 'దీపక' రాగాన్ని గానం చేస్తే అగ్ని పుడుతుంది అంటారు. 'మేఘమల్హార్' రాగాన్ని పాడితే వర్షం పడుతుంది అంటారు. సంగీతంవల్ల మానవ హృదయం ఆహ్లాదమైన మార్పు పొందును అన్నది ముమ్మాటికి నిజం. ఈ కర్నాటక సంగీతం 12వ శతాబ్దంలో జయదేవుడు అష్టపదుల ద్వారా సంగీతాన్ని పునరుజ్జీవింపచేయుటం 15వ శతాబ్దంలో కర్ణాటక సంగీత పితామహుడిగా గుర్తింపు పొందిన పురందర దాసు, కర్ణాటక సంగీతానికి మొదటి స్వరకర్తగా గుర్తింపు పొందిన తాళ్లపాక అన్నమాచార్యులచే పరిణతి చెంది 17వ శతాబ్దంలో నారాయణ తీర్థులు, క్షేత్రయ్య, రామదాసులచే కొత్త పుంతలు తొక్కి 18వ శతాబ్దంలో కర్ణాటక సంగీతంలో త్రిమూర్తులుగా పిలువబడే శ్యామ శాస్త్రి, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్ ద్వారా దేశవ్యాప్తంగా విరాజిల్లి తెలుగు జాతి ఎనలేని కీర్తిని గడించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన జరిగిన తరువాత రాష్ట్రంలో మొట్ట మొదటి సారిగా కేంద్ర ప్రభుత్వం వారి సంయుక్త ఆధ్వర్యంలో "కృష్ణవేణి సంగీత నీరాజనం" అనే సంగీతోత్సవంను 2023, డిసెంబరు 10 నుండి 12 వరకు విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ అలాగే శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, కృష్ణా నది ఘాట్ వద్ద నిర్వహిస్తున్నారు. ఈ సంగీతోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ఆంధ్ర ప్రదేశ్ అద్భుతమైన సంగీత సంప్రదాయాలను పరిరక్షించడంతోపాటు తద్వారా హరికథ, నామసంకీర్తన సంప్రదాయాలపై దృష్టిని పునరుద్ధరించే ప్రయత్నం చేయడం, తెలుగు భాష గొప్పతనాన్ని, వారసత్వాన్ని వెలుగులోకి తీసుకురావడం. అదేవిధంగా ఈ ఉత్సవం ఆంధ్రప్రదేశ్‌లోని సంగీత కళాశాలల విద్యార్థులకు, విశ్వ విద్యాలయాల విద్యార్థులకు నేర్చుకోవడానికి వారి ప్రతిభను ప్రదర్శించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

ఆర్ మల్లికార్జున రావు,
భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు

అసోంపై రాజకీయ వివాదం

న్యూఢిల్లీ: 'అసోం'పై సీనియర్ న్యాయవాది, ఎంపీ కపిల్ సిబల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వివాదానికి దారితీసింది. సుప్రీంకోర్టులో ఓ కేసు విచారణ సందర్భంగా అసోం ఒకప్పుడు మైన్మార్‌లో భాగమేనని సిబల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా మండిపడ్డారు. 1955 పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఏ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల విచారణ చేపట్టింది. దీనికి సంబంధించి కపిల్ సిబల్ తన వాదనలు వినిపిస్తూ వలసలపై ఎలాంటి రికార్డులు ఉండవు. ఒకవేళ మీరు అసోం చరిత్రను పరిశీలిస్తే ఎవరు ఎప్పుడు వచ్చారనేది గుర్తించడం అసాధ్యమని అర్థమవుతుంది. వాస్తవానికి అసోం ఒకప్పుడు మైన్మార్‌లో భాగమే. 1824లో చేసుకున్న ఒప్పందంలో భాగంగా అసోంను మైన్మార్ బ్రిటిష్ వారికి అప్పగించిందని వ్యాఖ్యానించారు. కపిల్ వాదనలకు సంబంధించి జాతీయ మీడియాలో కొన్ని కథనాలు రావడంతో ఇది వివాదాస్పదంగా మారింది. దీనిపై హిమంత బిశ్వ శర్మ తాజాగా స్పందిస్తూ సిబల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అసోం చరిత్ర గురించి తెలియని వారు.. తమ రాష్ట్రం గురించి మాట్లాడొద్దు. అసోం ఎప్పుడూ మైన్మార్‌లో భాగం కాదు. కొంతకాలం పాటు దీని గురించి గొడవలు జరిగాయి. అసోం మైన్మార్‌లో భాగమేనని చెప్పే ఏ డేటాను ఇంతవరకు తాను చూడలేదని సీఎం ఎదురుదాడికి దిగారు.

నేను సంతకం చేయలేదు

హమాస్ ప్రశ్న వార్తలపై కేంద్రమంత్రి

న్యూఢిల్లీ: హమాస్‌ను ఉగ్రవాదసంస్థగా ప్రకటించే అంశంపై లేవనెత్తిన ప్రశ్నకు సమాధానంగా తాను పత్రంపైనా సంతకం చేయలేదని కేంద్రమంత్రి మీనాక్షి లేఖి చెప్పుకొచ్చారు. భారత్ దానిని ఉగ్రసంస్థగా ప్రకటించే యోచనలో ఉందా అనే ప్రశ్నతో కూడిన దస్త్రాలపై సంతకం చేశానంటూ వస్తున్న వార్తలను ఆమె ఖండించారు. హమాస్‌కు సంబంధించి మంత్రి సమాధానం ఇచ్చినట్టుగా ఉన్న కొన్ని దస్త్రాలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. దీనిపై ఆమె స్పందిస్తూ ఇది తప్పుడు సమాచారమని, ఈ అంశంలో ఏ పేపర్‌పై తాను సంతకం చేయలేదని వివరించారు. విచారణ ద్వారా బాధ్యులు బయటకు వస్తారని లేఖి ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఆమె విదేశాంగ శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. మంత్రి ఇచ్చిన స్పష్టతపై శివసేన(యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది స్పందించారు. ఫోర్జరీ జరిగి ఉంటుందని ఆమె అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. ఒకవేళ అదే నిజమైతే.. ఇది తీవ్రస్థాయి నిబంధనల ఉల్లంఘనే అవుతుందని, దీనిపై ఆమె నుంచి స్పష్టత వస్తే సంతోషిస్తామని చెప్పారు. హమాస్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించాలని ఇజ్రాయిల్ రాయబారి భారత్‌ను అభ్యర్థించారు. కానీ ఆ దిశగా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ఐసిస్ కుట్ర కేసులో ఎన్ఐఏ దాడులు

15 మంది అరెస్టు

న్యూఢిల్లీ: ఐసిస్ కుట్ర కేసుకు సంబంధించి మహారాష్ట్ర, కర్నాటకలోని 44 ప్రాంతాల్లో ఏకకాలంలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) దాడులు చేసింది. శనివారం తెల్లవారుజాము నుంచి నిర్వహిస్తోన్న ఈ దాడుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేసింది. ఐఎస్ఐఎస్ కుట్ర కేసులో భాగంగా మహారాష్ట్రలోని పూనె, థానె, మీరా భయాందర్ సహా అనేక ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు చేపట్టింది. మరోవైపు కర్నాటకలోనూ ఈ దాడులు కొనసాగాయి. పూనెలో రెండు చోట్ల, థానెలో 40 చోట్ల, కర్నాటకలో రెండు ప్రాంతాల్లో ఈ సోదాలు కొనసాగినట్లు అధికారులు తెలిపారు. పూనె ఐఎస్ఐఎస్ మాడ్యుల్ కేసులో కీలక నిందితుడు షానవాజ్‌ను దిల్లీలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతడి వద్ద నుంచి ఐఈడీలు తయారు చేసేందుకు ఉపయోగించే రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ కేసుతో సంబంధమున్న వారందరినీ పట్టుకునేందుకు ఎన్ఐఏ అధికారులు ఈ ఆపరేషన్ చేపట్టారు. పూనె మాడ్యూల్ కేసుతో సంబంధమున్న మరో ఏడుగురిని ఎన్ఐఏ అరెస్టు చేసి గత నెలలో ఛార్జిషీట్ దాఖలు చేసింది. నిందితులు ఉగ్ర ముఠాలు ఏర్పాటు చేసి... నిధులు సేకరిస్తున్నారని పేర్కొంది. వారి నుంచి మారణాయుధాలు, ఐఈడీ, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

సీఎంల ప్రకటనపై జాప్యమేమిటి: గెహ్లాత్



జైపూర్: మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రకటించడంలో బీజేపీ జాప్యం చేస్తోందని రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాత్ విమర్శించారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో రాజస్థాన్‌లో కాంగ్రెస్ పార్టీ ఓటమిపాలైన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ఓటమిపై అశోక్ గెహ్లాత్ మీడియాతో మాట్లాడుతూ రాజస్థాన్‌లో బీజేపీ కాకుండా కాంగ్రెస్ గెలిచి ఉంటే ఇప్పటి వరకూ సీఎంని ప్రకటించకపోతే బీజేపీ నేతలు తమపై రుపులు, కేకలు వేసేవారని, బీజేపీలో క్రమశిక్షణ లేదని ఆరోపించారు. వారం రోజులు గడుస్తున్నా మూడు రాష్ట్రాల్లో ఇప్పటివరకు సీఎంలను ఎంపిక చేయలేదన్నారు. విభజన సిద్ధాంతం ప్రాతిపదికన బీజేపీ ఎన్నికల్లో గెలిచిందన్నారు. ఇప్పుడు కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి తమ సహకారం ఉంటుందని గెహ్లాత్ అన్నారు. గోగమేడి కేసులో ఎన్ఐఏ విచారణకు తాను అభ్యంతరం చెప్పలేదని, ఈ ఫైల్‌పై తాను సంతకం చేయలేదని, కొత్త సీఎం ఎన్ఐఏ ఫైల్‌పై సంతకం చేయాల్సి ఉందన్నారు.

వైవాహిక అత్యాచారం నేరం కాదు: అలహాబాద్ హైకోర్టు

అలహాబాద్: భారతీయ శిక్షాస్మృతి ప్రకారం భార్యకు 18 ఏళ్లు నిండితే వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించలేమని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. 'అసహజ నేరం' కింద ఆరోపణలు ఎదుర్కొంటున్న భర్తను నిర్దోషిగా ప్రకటించింది. నిందితుడిని ఐపీఎల్ సెక్షన్ 377 కింద దోషిగా నిర్ధారించలేమని జస్టిస్ రామ్‌మనోహర్ నారాయణ మిశ్రా ధర్మాసనం తేల్చి చెప్పింది. వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లు ఇప్పటికీ సుప్రీంకోర్టులో పెండింగులో ఉండడం వల్ల, భార్యకు 18 ఏళ్లు, అంతకుమించి ఉంటే వైవాహిక అత్యాచారానికి ఎలాంటి క్రిమినల్ పెనాల్టీ ఉండదని హైకోర్టు పేర్కొంది. భర్త తనను దూషిస్తూ శారీరక వేధింపులకు గురిచేయడమే కాకుండా బలవంతం చేశాడని బాధిత మహిళ తన పిటిషన్‌లో ఆరోపించింది. కేసును విచారించిన హైకోర్టు అభియోగాల నుంచి ఆమె భర్తకు విముక్తి కల్పించింది. అయితే, అతడు, అతడి బంధువులు ఆమెతో క్రూరంగా వ్యవహరించడం, గాయపరచడం వంటి అభియోగాల్లో అతడిని దోషిగా నిర్ధారించింది.

సబ్బుపొడి గోదాంలో భారీ అగ్నిప్రమాదం

రూ.100 కోట్ల ఆస్తి నష్టం

చెన్నై: సబ్బుపొడి గోదాంలో భారీ అగ్నిప్రమాదం సంభవించి దాదాపు రూ.100 కోట్ల ఆస్తి నష్టం జరిగింది. ఈ ఘటన శనివారం ఉదయం తమిళనాడులోని ఉత్తర చెన్నైలో సంభవించింది. ఉత్తర చెన్నైలోని మనాలి సమీపంలోని వైకాడు ప్రాంతంలో సబ్బు పొడి గోదాంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దాదాపు 100 కోట్ల రూపాయల విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. ఆరు అగ్నిమాపక యంత్రాలు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. మంటలు అదుపు చేయడానికి అగ్నిమాపక అధికారులు తీవ్రంగా ప్రయత్నించారు. మనాలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. తమిళనాడు అగ్నిమాపక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రియా రవిచంద్రన్ సహాయక చర్యలను పర్యవేక్షించారు.

77వ పడిలోకి సోనియా - శుభాకాంక్షల వెల్లువ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ 77వ పడిలోకి అడుగు పెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు అనేకమంది పార్టీ నాయకులు, ఇతరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సోనియాగాంధీ ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని మోదీ ట్వీట్ చేశారు. సోనియాను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఖర్గే అనంతరం ఎక్స్ మాధ్యమంగా కాంగ్రెస్ కార్యకర్తలందరి తరఫున ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ధైర్యంగా, హుందాగా దేశానికి సేవ చేశారని, పార్టీకి తోడ్పాటు అందించారని, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. మంచి ఆరోగ్యంతో ఎక్కువ కాలం జీవించాలని ఖర్గే ఆకాంక్షించారు. కాంగ్రెస్ అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ వీడియో ద్వారా సోనియాగాంధీకి శుభాకాంక్షలు తెలిపింది. సాహసోపేత నిర్ణయాలతో భారతదేశానికి, కాంగ్రెస్ పార్టీకి గణనీయమైన తోడ్పాటు అందించారని, అణగారిన వర్గాల హక్కుల కోసం విప్లవానికి తెరతీశారని శ్లాఘించింది. 'సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా దీర్ఘకాలం కొనసాగారు. అనారోగ్యం కారణంగా కొన్నేళ్లుగా ఆమె క్రియాశీల రాజకీయాల్లో చురుకుగా ఉండటంలేదు. ఆమె కుమారుడు రాహుల్, కుమార్తె ప్రియాంక గాంధీ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు' అని కాంగ్రెస్ పేర్కొంది.

కాంగ్రెస్ ఎంపీ లక్ష్యంగా ఐటీ దాడులు

290 కోట్లు స్వాధీనం

న్యూఢిల్లీ: ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లోని డిస్టిలరీ గ్రూప్, దాని అనుబంధ సంస్థలపై ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ దాడులు నిర్వహించింది. ఇందులో కళ్లు చెదిరేలా నోట్ల గుట్టలు బయటపడ్డాయి. ఇప్పటిదాకా రూ.290 కోట్లకు పైగా డబ్బు పట్టుబడిందని, ఇంకా లెక్కింపు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. జార్ఖండ్‌కు చెందిన కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహుకు ఈ కేసుతో సంబంధం ఉందన్న ఆరోపణతో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ ధీరజ్ సాహు ఎవరు? ఆయన వివరాలేమిటి? ఇంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? అన్న చర్చ ప్రారంభమైంది. ధీరజ్ సాహు ఒక ప్రముఖ వ్యాపారవేత్త. ఆయన కుటుంబానికి చాలాకాలంగా కాంగ్రెస్‌తో అనుబంధం ఉంది. 2010లో జార్ఖండ్ నుంచి ధీరజ్ రాజ్యసభకు కాంగ్రెస్ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయన కుటుంబం చాలా వ్యాపారాలు నిర్వహిస్తోంది. తాజాగా ఐటీ శాఖ దాడులు నిర్వహించిన డిస్టిలర్ గ్రూప్, దాని అనుబంధ సంస్థలతో ధీరజ్ కుటుంబ సభ్యులకు బంధం ఉన్నట్లు తేలింది. బౌద్ డిస్టిలరీస్‌లో గ్రూప్ కంపెనీ అయిన బల్దేవ్ సాహు ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ధీరజ్‌తో ముడిపెట్టారు. ఈ విధంగా రూ.290 కోట్ల నల్లధనం కుంభకోణంలో ధీరజ్ పేరు వెలుగులోకి వచ్చింది. దీంతో ప్రధాని మోదీ సహా ఇతర బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. దేశప్రజలు ఈ నోట్ల కుప్పను చూసి... కాంగ్రెస్ నాయకుల నిజాయతీ'తో కూడిన ప్రసంగాలు వినాలని, ప్రజల నుండి ఏది దోచుకున్నా ప్రతి పైసా తిరిగి ఇవ్వాలని, ఇది మోదీ హామీ అని ప్రధాని మోదీ తన ట్వీట్‌లో కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శించారు. కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ స్పందిస్తూ గతంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ నోట్ల రద్దుకు వ్యతిరేకంగా మాట్లాడడానికి ఇదే కారణమని విమర్శించారు. 'డబ్బులు లెక్క పెడుతుండగానే కౌంటింగ్ మెషీన్లు చెడిపోయాయి. అధికారులు అలసిపోయారు.

ఆ నగదును భర్తీ చేసేందుకు బ్యాగుల కొరత ఏర్పడింది. డబ్బులు కుప్పలు తెప్పలుగా బయటపడుతూనే ఉన్నాయి. కాంగ్రెస్ అవినీతికి మారుపేరు అనడానికి ఇదే ఉదాహరణ అని ఆరోపించారు. మరోవైపు అవినీతిని అరికట్టడంలో జార్ఖండ్ సీఎం హేమంత సోరెన్ విఫలమయ్యారని విమర్శిస్తూ ఆయన సీఎం పదవికి రాజీనామా చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా డిమాండ్ చేశారు.

తవ్వేకొద్దీ నోట్ల కట్టలు

న్యూఢిల్లీ: దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఐటీ దాడుల్లో నోట్ల గుట్టలు బయటపడుతన్నాయి. ఒడిశా, జార్ఖండ్‌లోని డిస్టిలరీ గ్రూప్, దాని అనుబంధ సంస్థలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.290 కోట్లు పట్టుబడ్డాయి. ఒక్క ఆపరేషన్లోనే ఇంత నల్లధనం పట్టుబడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. నోట్ల లెక్కింపు కోసం శనివారం ఐటీ శాఖ 40 యంత్రాలు వినియోగించింది. పట్టుబడిన డబ్బును ప్రభుత్వ బ్యాంకులకు తరలించే ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వివిధ కంపెనీ అధికారులు, ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తుల వాంగ్మూలాలు రికార్డ్ చేశారు. జార్ఖండ్‌కి చెందిన కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యుడు ధీరజ్ ప్రసాద్ సాహూ ఇంటిని కూడా ఐటీ అధికారులు తనిఖీ చేశారు. ఒడిశాలోని లిక్కర్ డిస్టిలరీ గ్రూపులపై ఐటీ శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. బొలంగీర్ జిల్లా సుదాపరాలో మద్యం తయారు చేస్తున్న కొందరి నివాసం నుండి శనివారం 20 బ్యాగ్‌ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

యుద్ధ విమానాలకు డిజిటల్ మ్యాప్‌లు

న్యూఢిల్లీ: యుద్ధవిమానాలను రూట్ మ్యాప్ సమస్య వేధిస్తోంది. గతంలో కెప్టెన్ అభినందన్ వర్ధమాన్ రూట్ మ్యాప్ సమస్యే వచ్చి దాయాదుల చేతిలో చిక్కుకున్నారు. పైలట్లు కొండ ప్రాంతాల్లో వెళ్తున్నప్పుడు ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. అయితే ఈ సమస్యకు చెక్ పెట్టనున్నట్లు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) డైరెక్టర్ సునీల్ తెలిపారు. వీటికి పరిష్కారంగా డిజిటల్ మ్యాప్‌ను త్వరలో అన్ని యుద్ధ హెలికాప్టర్లలో అమర్చనున్నట్లు చెప్పారు. ఇవి కొండ ప్రాంతాల్లో నావిగేట్ చేయడానికి ఉపయోగపడతాయన్నారు. పైలట్లు ఎగురుతున్నప్పుడు వారి కాక్‌పిట్ డిస్‌ప్లేలో మ్యాప్‌ను చెక్ చేసుకోగలరని తెలిపారు. తద్వారా తాము ఉన్న ప్రాంతాన్ని, యుద్ధవిమానాలు వెళుతున్న దిశను తేలికగా తెలుసుకోవచ్చన్నారు. 2019 బాలాకోట్ వైమానిక దాడుల సమయంలో శత్రు విమానంపై దాడి చేస్తున్న సమయంలో గ్రూప్ కెప్టెన్ అభినందన్ వర్ధమాన్‌కి చెందిన మిగ్-21 కుప్ప కూలడంతో ఆయన పాకిస్థాన్ దళాలకు దొరికారు. 3 రోజుల తరువాత పాక్ ఆయన్ని వదిలిపెట్టింది. ఇటువంటి పరిస్థితులలో డిజిటల్ మ్యాప్‌లు పైలట్‌లు దిశ కోల్పోకుండా, సరిహద్దుల్లో మరింత అప్రమత్తంగా ఉండేందుకు సహాయపడతాయని భావిస్తున్నారు. భారత యుద్ధ విమానాల్లో డిజిటల్ మ్యాప్‌లు అమర్చే ప్రక్రియ కొనసాగుతోంది. డిజిటల్ మ్యాప్ శత్రు సైనిక స్థావరాలు, వాయు రక్షణ వ్యవస్థల గురించి కూడా తెలియజేస్తాయని, వీటిని ప్రతి విమానంలో అమర్చుతామని, దాని హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ అన్నీ భారత్‌లోనే తయారు చేసినట్లు సునీల్ తెలిపారు.

బెంగాల్‌కు బకాయిలు చెల్లించాలని

ప్రధానిపై ఒత్తిడి తెస్తాం

సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా : రాష్ట్రానికి కేంద్రం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల కోసం డిమాండ్లను ఒత్తిడి చేయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలుస్తానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం తెలిపారు. మమత డిసెంబరు 18 నుంచి 20 వరకు దిల్లీలో పర్యటించనున్న సమయంలో ఎంజీఎన్ఆర్ఈజీఏ (మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం) నిధుల పంపిణీపై ప్రధానిని కలవడానికి సమయం కావాలని అభ్యర్థించినట్లు వివరించారు. 'నేను డిసెంబరు 18-20 మధ్య దిల్లీకి వెళుతున్నా. ఈ తేదీలలో ఆయనను కలవడానికి సమయం కావాలని నేను ప్రధాన మంత్రికి లేఖ రాశాను. వంద రోజుల పని పథకం నిధుల పంపిణీపై కొంతమంది ఎంపీలతో ఆయనను కలవాలనుకుంటున్నాను' అని సీఎం మమతా విలేకరులతో అన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ కార్యక్రమం కింద ఇప్పటికే జరిగిన పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి డబ్బులు బదిలీ కాలేదని ఆమె ఆరోపించారు. అంతేకాదు వంద రోజుల పని పథకం కింద ఇప్పటికే చేసిన పనులకు కూడా డబ్బులు బదిలీ కాలేదన్నారు. కేంద్రం రాష్ట్రం నుంచి జీఎస్‌టీ వసూలు చేస్తోందని... వచ్చే ఆదాయాన్ని పంచుకోవడం లేదని బెనర్జీ అన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ వంటి వివిధ కేంద్ర పథకాల కింద రాష్ట్రానికి రావాల్సిన అనేక నిధులు కూడా రావడం లేదని, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఆర్థిక బకాయిలు రాకుండా పోతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. వివిధ సంక్షేమ పథకాలకు కేంద్రం తన వాటా నిధులను నిలిపివేసినప్పటికీ, రాష్ట్రం తన సొంత వనరులతో వాటిని కొనసాగిస్తోందని తెలిపారు. ఇతర రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం నుంచి డబ్బులు స్వీకరిస్తుంటే, పశ్చిమ బెంగాల్‌కు నిధుల విడుదలను ఎందుకు ఆపుతున్నారని ఆమె ప్రశ్నించారు. 'వారు బకాయిలు ఇవ్వలేదు. పైగా, ఆరోగ్యం, ఇళ్లు, రోడ్లు, ఆస్పత్రుల కోసం మా వాటా డబ్బును కూడా నిలిపివేశారు. మాకు కావాల్సింది వారి డబ్బు కాదు. మా వాటా. ప్రతి రాష్ట్రానికి డబ్బు అందుతుంటే, మాకు ఎందుకు రావడం లేదు. అందుకే మేము ఆయనను కలిసేందుకు సమయం కోరాము' అని చెప్పారు. డిసెంబరు 18 నుంచి 20 మధ్య ఏ రోజు అయినా కలవడానికి ప్రధానమంత్రి అంగీకరించకపోతే, తాము చేయవలసింది చేస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. 'ఆయన (సమావేశానికి) సమయం కేటాయిస్తే ఫర్వాలేదు. కానీ మేము కచ్చితంగా డిసెంబరు 17న దిల్లీకి బయలుదేరుతాము. డిసెంబరు 18, 19, 20 తేదీలలో మాకు సమయం ఇస్తారని మేము వేచి ఉంటాము. ఆయన స్పందించకపోతే, మేము చేయవలసినది చేస్తాము' అని అన్నారు.

జీడీపీ వృద్ధి సంస్కరణల ప్రతిబింబం

ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో భారత జీడీపీ వృద్ధిరేటు 7.7 శాతంగా నమోదవడం దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసిందని, పదేళ్లలో చేపట్టిన పరివర్తనాత్మక సంస్కరణలకు అద్దం పడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం అన్నారు. ఇక్కడి గిఫ్ట్ సిటీలో 'ఇన్ఫినిటీ ఫోరమ్ 2.0' సదస్సులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించిన మోదీ, రానున్న కొద్ది సంవత్సరాల్లో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తన ప్రభుత్వం గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ (గిఫ్ట్) సిటీని కొత్త యుగం ప్రపంచ ఆర్థిక, సాంకేతిక సేవలకు ప్రపంచ నాడీ కేంద్రంగా మార్చాలని కోరుకుంటోందని కూడా ఆయన చెప్పారు. 'ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో భారతదేశం 7.7 శాతం జీడీపీ వృద్ధిని సాధించింది. నేడు ప్రపంచం మొత్తం భారతదేశంపై తన ఆశలు పెట్టుకుంది. ఇది కేవలం తనంతట తానుగా జరగలేదు. భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు 10 ఏళ్లలో అమలు చేసిన పరివర్తనాత్మక సంస్కరణలకు ఇది ప్రతిబింబం' అని మోదీ తన ప్రారంభ ప్రసంగంలో పేర్కొన్నారు. 'ఈ సంస్కరణలు దేశ ఆర్థిక పునాదులను బలోపేతం చేశాయి. మహమ్మారి సమయంలో చాలా దేశాలు ఆర్థిక, ద్రవ్యపరమైన ఉపశమనంపై మాత్రమే దృష్టి కేంద్రీకరించినప్పుడు మేము దీర్ఘకాలిక వృద్ధి, ఆర్థిక సామర్థ్యం విస్తరణపై దృష్టి సారించాము' అని ఆయన చెప్పారు. భారతదేశం కారణంగా ప్రపంచ వృద్ధి 16 శాతం ఉంటుందని అంచనా అని అన్నారు. భారతదేశం నేడు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఫిన్‌టెక్ మార్కెట్‌లలో ఒకటి, ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్ఎస్‌సీ) దాని కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని తెలిపారు. 'గిఫ్ట్ సిటీ ఉత్పత్తులు, సేవలు నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో సహాయపడతాయని నేను విశ్వసిస్తున్నాను' అని అన్నారు. సిటీ ప్రపంచ ఫిన్‌టెక్ ప్రపంచానికి ప్రధాన ద్వారంగా, ఫిన్‌టెక్ ప్రయోగశాలగా మారే సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపారు. భారతదేశాన్ని తక్కువ కార్బన్ ఆర్థిక వ్యవస్థగా మార్చడానికి గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీ సమర్థవంతమైన మార్గం అని మోదీ అన్నారు. 'ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న సవాళ్లలో అతిపెద్దది వాతావరణ మార్పు. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా, భారతదేశం కూడా ఈ ఆందోళనల గురించి చాలా స్పృహతో ఉంది' అని మోదీ అన్నారు. దేశం, పౌరుల ప్రయోజనాలే ఆర్థిక విధానానికి ప్రాతిపదికగా ఉన్నప్పుడు సుపరిపాలన కోసం అన్ని ప్రయత్నాలు చేసే విధానానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తే ఎలాంటి ఫలితాలు సాధించవచ్చో భారతదేశ వృద్ధి కథ ప్రపంచానికి చూపిందని తెలిపారు. గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీ భారతీయ ఆర్థిక మార్కెట్‌లను ప్రపంచ ఆర్థిక మార్కెట్‌లతో అనుసంధానించడానికి మేము చేపడుతున్న పెద్ద సంస్కరణల్లో ఇవి ఒక భాగమని ఆయన అన్నారు. 'రాబోయే కొన్ని సంవత్సరాలలో గిఫ్ట్ సిటీ అత్యుత్తమ అంతర్జాతీయ ఆర్థిక కేంద్రాలలో ఒకటిగా ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను' అని చెప్పారు. 'భారత యువత ప్రతిభకు ధన్యవాదాలు. మేము అన్ని పెద్ద కంపెనీలకు ప్రపంచ సామర్థ్య కేంద్రాలకు ఆధారం అయ్యామని' అన్నారు. రానున్న కొద్ది సంవత్సరాల్లో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని మోదీ అన్నారు.

205 మంది ఎమ్మెల్యేలు కోటీశ్వరులే

అత్యధికులు బీజేపీ వారే: ఏడీఆర్

భోపాల్: ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేల్లో అత్యధిక శాతం మంది కోటీశ్వరులేనని అసోసియేషన్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదక గురువారం వెల్లడించింది. మొత్తం 230 మంది ఎమ్మెల్యేల్లో 205 మంది కోటీశ్వరులు ఉన్నారని, 2018లో కోటీశ్వరులైన ఎమ్మెల్యేల సంఖ్య 187గా ఉండగా, 2023 నాటికి ఈ సంఖ్య 205కి పెరిగిందని పేర్కొంది. ఈ ఎమ్మెల్యేలలో 144 మంది బీజేపీకి చెందిన వారు కాగా, 61 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలని వివరించింది. ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.11.77 కోట్లు. మొత్తం 230 మందిలో 102 మంది ఎమ్మెల్యేలు రూ.5 కోట్లు అంతకంటే ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్నట్లు నివేదిక పేర్కొంది. 71 మంది ఎమ్మెల్యేలు రూ.2 కోట్ల నుండి 5 కోట్ల మధ్య ఆస్తులు ఉన్నట్లు ప్రకటించారు. 48 మంది ఎమ్మెల్యేలు రూ.50 లక్షల నుండి రూ.2 కోట్ల మధ్య ఆస్తులు కలిగి ఉండగా, తొమ్మిది మందికి రూ.50 లక్షల కన్నా తక్కువ ఆస్తులు ఉన్నట్లు నివేదిక ప్రకటించింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్‌నాథ్ రూ.134 కోట్ల కన్నా ఎక్కువ విలువైన ఆస్తులు కలిగి ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేల్లో ఒకరు. రత్లాం సిటీ నుండి నూతనంగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే చైతన్య కశ్యప్ రూ.296 కోట్ల ఆస్తులతో అగ్రస్థానంలో ఉండగా, ఆయన పార్టీ సహచరుడు సంజయ్ సత్యేంద్ర పాఠక్ (విజయ్‌రాఘవగఢ్) రూ.242 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో ఉన్నారు. 2018లో బీజేపీ 109 స్థానాల్లో గెలుపొందగా, ఇటీవల జరిగిన ఎన్నికల్లో 163 స్థానాలను కైవసం చేసుకుంది. కాంగ్రెస్ 2018లో 114 సీట్లు గెలుచుకోగా, ప్రస్తుతం 66 సీట్లకు పరిమితమైంది. భరత్ ఆదివాసీ పార్టీ ఒక నియోజకవర్గంలో విజయం సాధించింది. భరత్ ఆదివాసీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కమలేశ్ దోడియార్ రూ.18 లక్షలతో అత్యల్ప ఆస్తులు కలిగిన ఎమ్మెల్యేల్లో మొదటి స్థానంలో నిలిచారు. అత్యల్ప ఆస్తులు కలిగిన బీజేపీ ఎమ్మెల్యేల్లో కంచన్ ముఖేశ్ తన్వే రూ. 26 లక్షల ఆస్తులు కలిగి ఉండగా, సంతోశ్ వర్కడే రూ.25 లక్షల ఆస్తులు కలిగి ఉన్నారు. అత్యధిక బకాయిలు ఉన్న అభ్యర్థుల్లో బీజేపీ మాజీ మంత్రి సురేంద్ర పట్వా (భోజ్‌పూర్)కు రూ.57 కోట్లు అప్పు ఉంది. కాంగ్రెస్‌కు చెందిన దినేశ్ జైన్ (మహిద్‌పూర్) రూ.30 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. బీజేపీకి చెందిన భూపేంద్ర సింగ్ (ఖురారు) రూ.23 కోట్ల అప్పుతో మూడో స్థానంలో నిలిచినట్లు ఏడీఆర్ నివేదిక తెలిపింది.

న్యాయం జరిగేదెప్పుడు?

- 2.43 లక్షల పోక్సో కేసుల పెండింగ్
- ఫాస్ట్ ట్రాక్ కోర్టులున్నా పరిష్కారంలో ఆలస్యం
- 2022లో శిక్షల రేటు 3 శాతమే
- ఛిద్రమవుతున్న బాలల బతుకులు
- తాజా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో బాలలపై లైంగిక వేధింపులు, అత్యాచార ఘటనలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది జనవరి 31 నాటికి పోక్సో చట్టం కింద 2.34 లక్షలకు పైగా కేసులు ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాలు (ఎఫ్‌టీఎస్‌సీలు) లో పెండింగ్‌లో ఉన్నాయని ఒక ఎన్‌జీవో ప్రచురించిన పరిశోధనా పత్రం పేర్కొంది. 2022లో నేరారోపణకు దారితీసిన అటువంటి కేసుల సంఖ్య జాతీయంగా కేవలం మూడు శాతం మాత్రమేనని పేర్కొంది. ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐసీపీఎఫ్) విడుదల చేసిన పరిశోధనా పత్రం 'న్యాయం వేచి ఉంది : భారతదేశంలో బాలలపై లైంగిక వేధింపుల కేసుల్లో న్యాయ పంపిణీ యంత్రాంగాల సమర్థతపై ఒక విశ్లేషణ' ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ పరిశోధనా పత్రంలో కొత్త కేసులు ఏవీ చేర్చనప్పటికీ, పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడానికి దేశానికి కనీసం తొమ్మిదేళ్ల సమయం పడుతుంది. అరుణాచల్ ప్రదేశ్, బీహార్ వంటి కొన్ని రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి 25 సంవత్సరాల కంటే ఎక్కువ సమయం పట్టవచ్చు. లైంగిక వేధింపులకు గురైన బాధిత బాధితులకు న్యాయం చేసేందుకు ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలని 2019లో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని, ప్రతి చిన్నారికి న్యాయం జరిగేందుకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నప్పటికీ, ఈ పరిశోధనా పత్రంలోని ఫలితాలు దేశ న్యాయ వ్యవస్థ సమర్థతపై భారీ ప్రశ్నార్థకంగా మారాయి. ప్రస్తుత దృష్టాంతాన్ని చూస్తే, అరుణాచల్ ప్రదేశ్‌లో జనవరి 2023 నాటికి లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ (పోక్సో) చట్టం కింద పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణను పూర్తి చేయడానికి 30 ఏళ్లు పడుతుందని, ఢిల్లీకి 27 ఏళ్లు, పశ్చిమ బెంగాల్ 25 ఏళ్లు, మేఘాలయ 21, బీహార్ 26, ఉత్తర ప్రదేశ్‌కు 22 సంవత్సరాలు పడుతుందని తెలిపింది. 2019లో ఏర్పాటయిన ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు అటువంటి కేసుల విచారణను ఒక సంవత్సరంలోపు పూర్తి చేసేలా చట్టపరమైన ఆదేశాన్ని అందజేయాల్సి ఉండగా, విచారణలో ఉన్న మొత్తం 2,68,038 కేసుల్లో కేవలం 8,909 కేసుల్లో మాత్రమే నిందితులకు శిక్ష పడింది. రూ.1,900 కోట్ల కంటే ఎక్కువ బడ్జెట్ కేటాయింపులతో 2026 వరకు కేంద్ర ప్రాయోజిత పథకంగా ఎఫ్‌టీఎస్‌సీలు కొనసాగించడానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించింది. దేశంలోని ప్రతి ఎఫ్‌టీఎస్‌సీ సగటున సంవత్సరానికి కేవలం 28 కేసులను పరిష్కరిస్తుంది. అంటే ఒక నేరారోపణలో దాదాపు రూ.9 లక్షల వ్యయం అవుతుందని అధ్యయనం ప్రత్యేకంగా ప్రస్తావించింది. చట్టం, న్యాయ మంత్రిత్వ శాఖ, మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, జాతీయ నేర నమోదు సంస్థ నుంచి వచ్చిన గణాంకాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. 'ప్రతి ఎఫ్‌టీఎస్‌సీ త్రైమాసికంలో 41-42 కేసులను, ఒక సంవత్సరంలో కనీసం 165 కేసులను పరిష్కరించగలదని అంచనా వేశారు. పథకం ప్రారంభించిన మూడు సంవత్సరాల తర్వాత కూడా ఎఫ్‌టీఎస్‌సీలు నిర్దేశిత లక్ష్యాలను సాధించలేకపోతున్నాయని గణాంకాలు సూచిస్తున్నాయి' అని పరిశోధనా పత్రం పేర్కొంది. సుప్రీం కోర్టు తీర్పును ఉటంకిస్తూ, బాల్యవివాహం అనేది బాల్య అత్యాచారం అని తెలిపింది. 2011 జనాభా లెక్కల ప్రకారం, ప్రతిరోజూ 4,442 మంది మైనర్ బాలికలకు వివాహాలు జరుగుతున్నాయని, అంటే ప్రతి నిమిషానికి ముగ్గురు పిల్లలు బాల్య వివాహాల్లోకి నెట్టబడుతున్నారని నివేదిక వెల్లడించింది. అయితే జాతీయ నేర నమోదు సంస్థ తాజా గణాంకాల ప్రకారం ప్రతిరోజూ మూడు బాల్య వివాహాలు మాత్రమే నమోదవుతున్నాయి. దృఢమైన విధానం, కఠినమైన చట్టాలు, తగినంత ఆర్థిక నిబద్ధత ఉన్నప్పటికీ, నేరారోపణకు సంబంధించి మైనస్ రేటు తీవ్ర ఆందోళన కలిగించే విషయం ఐసీపీఎఫ్ వ్యవస్థాపకుడు భువన్ రిభు అన్నారు. 'చట్ట స్ఫూర్తిని ప్రతి బిడ్డకు న్యాయంగా మార్చాల్సిన అవసరం ఉంది. పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడిన వారిలో కేవలం మూడు శాతం మంది మాత్రమే దోషులుగా తేలినప్పుడు చట్టపరమైన ప్రతిఘటన ఉండదు' అని అన్నారు. పిల్లలందరినీ రక్షించడానికి, పిల్లలు, వారి కుటుంబాలకు రక్షణ కల్పించడం, పునరావాసం, పరిహారం పొందడం, దిగువ కోర్టులలో విచారణ, తదుపరి హైకోర్టులు. సుప్రీంకోర్టు అప్పీలులతో సహా కాలపరిమితితో కూడిన న్యాయ ప్రక్రియను నిర్ధారించడం అత్యవసరం' అని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడంతో పాటు లైంగిక వేధింపులకు గురైన బాధిత చిన్నారులకు సకాలంలో న్యాయం జరిగేలా చూసేందుకు ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాలు పని చేయాలని, బలమైన ఒక కార్యాచరణ కలిగి ఉండాలని ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ ఫండ్ సిఫార్సు చేసింది. పోలీసు సిబ్బంది నుంచి న్యాయమూర్తుల వరకు మొత్తం ఎఫ్‌టీఎస్‌సీ సిబ్బందిని ఈ కోర్టులకు ప్రత్యేకంగా జతచేయాలని, తద్వారా వారు ఈ కేసులను ప్రాధాన్యత ప్రాతిపదికన తీసుకోవచ్చని పరిశోధనా పత్రం సిఫార్సు చేసింది. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు మరిన్ని ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలని, పారదర్శకత కోసం ఎఫ్‌టీఎస్‌సీల డ్యాష్‌బోర్డ్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కూడా సిఫార్సు చేసింది.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో
20న విజయవాడలో ధర్నా
14న జరగాల్సిన కార్యక్రమం వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వలసలు, కరువు నివారణకు ఉపాధి హామీ పనులు ప్రతి గ్రామంలో వెంటనే ప్రారంభించాలన్న డిమాండ్‌తో ఈనెల14న విజయవాడలో జరగాల్సిన ధర్నా వాయిదా పడింది. అనివార్య కారణాల వల్ల కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జల్లి విల్సన్, అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న విజయవాడలో ధర్నా జరుగుతుందని, దీనిని జయప్రదం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం శ్రేణులు కార్యక్రమం మార్పును గమనించాలని సూచించారు.

పుట్టుమచ్చ కవి ఖాదర్‌తో 'కవి సంధి'



విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): అస్తిత్వ వాదనలు ఐక్యతా చర్చలు ద్వారా సఫలీకృతులవు తారని కవి ఖాదర్ మొహియుద్దీన్ అన్నారు.కేంద్ర సాహిత్య అకాడమీ అధ్వర్యంలో శనివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో కవి సంధి కార్యక్రమం కేంద్ర సాహిత్య అకాడమీ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ బెల్లంకొండ అధ్యక్షతన జరిగింది. బెల్లంకొండ సభను ప్రారంభిస్తూ సమాజంలో ముస్లిం అస్తిత్వ వేదన ఇలా ఉంటుందా అనే రీతిలో పుట్టుమచ్చ రచన జరిగిందని కవి ఖాదర్ మొహియుద్దీన్‌ను పరిచయం చేశారు. ఖాదర్ మొహియుద్దీన్ మాట్లాడుతూ పద్యాలు సంధ్య, పోస్టు మార్టం, తట్టినట్లు, పు:స్త్రీ లింగంతోపాటు భావరస్మి, తప్పదుకాని, పెదాల చితి, శీర్షిక సిగరెట్టు నీడ, మరో ప్రయోగంతో 1970లో రాసిన ఒక నిర్లిప్తత, ఆత్మహత్య సైతం, చెప్పులు తొడుక్కున్న శవం, ప్రశ్నా అవసేషు, కిటికీలు, మెలకువ, పోగచెట్టు, పుట్టుమచ్చ ఇలా ఎన్నో రచనలు చేసినట్లు తెలిపారు. తన కవిత్వాన్ని చదివి వినిపించడమే కాక తన కవిత్వంపై ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. సాహితీప్రియులు అనీల్ దాని, గుమ్మా సాంబశివరావు, వల్లభరావు, గోళ్ల నారాయణరావు, శ్రీరాం పుప్పాల, సీతారామ్, అసురా, చల్లపల్లి స్వరూపరాణి, కె.లక్ష్మయ్య, లక్ష్మీనారాయణ, శాంతిశ్రీ, ఉషారాణి, పద్మ, వైష్ణవిశ్రీ, వరప్రసాద్, దివికుమార్ పాల్గొన్నారు.

11న కలెక్టర్లకు వినతులు
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నాయకులకు ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, మూడు సాగు చట్టాల వ్యతిరేకోద్యమంలో రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి డిమాండ్ చేసింది. ఇదే క్రమంలో ఈనెల11న అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతులు ఇవ్వాలని పిలుపునిచ్చింది కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరింది. శనివారం విజయవాడ దాసరి భవన్‌లో సీనియర్ రైతు నాయకులు వై.కేశవరావు అధ్యక్షతన సమన్వయ సమితి సమావేశం జరిగింది. సమితి రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, కేవీవీ ప్రసాద్, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, పి.జమలయ్య, కుర్రా నరేంద్ర, ఎం.వెంకటరెడ్డి, కె.ప్రసాద్, యు.వీరబాబు హాజరయ్యారు. కలెక్టర్లకు వినతుల కార్యక్రమం కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎస్‌కేఎం నేతలపై కొత్తగా 86 కేసులను మోపడం, నాయకత్వానికి నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని, వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుధ్వీర్ సింగ్‌ను అంతర్జాతీయ సెమినార్‌కు వెళ్లకుండా ఢిల్లీ విమానాశ్రయంలో నిర్బంధించడాన్ని ఖండించారు. రైతుల డిమాండ్ల పరిష్కారం కొరకు పోరాడాలని నేతలు పిలుపునిచ్చారు.

ఇతరుల మాట వినడమే పరిణతి
సీజేఐ చంద్రచూడ్

ముంబై: మన మాటే నెగ్గాలన్న మనస్తత్వాన్ని పక్కనపెట్టాలని, ఇతరుల మాట కూడా వినే పరిణతి ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ హితవు పలికారు. మహారాష్ట్రలోని పూనెలో గల సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ 20వ స్నాతకోత్సవంలో సీజేఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాసం, విలువల గురించి ఆయన ఆసక్తికర ప్రసంగం చేశారు. ఇతరుల మాట వినడమనేది జీవితంలోని ప్రతిదశలో చాలా ముఖ్యమని, కానీ, మన సమాజంలో ఉన్న సమస్య ఏమిటంటే మనం ఇతరుల మాటలు పట్టించుకో వట్లేదన్నారు. కేవలం మన మనసు చెప్పిన మాట మాత్రమే వింటున్నామని, ఇతరుల మాట వినే పరిణతి మనలో ఉన్నప్పుడే మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని సరికొత్తగా అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. జీవితం అనేది ఓ ప్రత్యేకమైన పద్ధతిలో మనకు పాఠాలు బోధిస్తుం దని, ఈ ప్రయాణంలో వినయం, ధైర్యం, చిత్తశుద్ధిని మన సహచరులుగా చేసుకోవాలని సీజేఐ వ్యాఖ్యానించారు.

ఈ తరం యువత ప్రశ్నించేందుకు భయ పడటం లేదని సీజేఐ అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల తాను చూసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ రీల్ గురించి ఆయన తెలిపారు. ఒక బాలిక తమ ప్రాంతంలోని రోడ్ల దుస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన వీడియోను ఇన్‌స్టా రీల్‌లో చూశానని, అది చూడగానే 1848 నాటి పరిస్థితులు గుర్తొచ్చా యన్నారు. ఆ ఏడాది పూనెలో తొలి బాలికల పాఠశాలను ఏర్పాటు చేశారని, పితృస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్న కాలంలో సావిత్రిబాయి పూలే బాలికా విద్యను ప్రోత్సహించారని గుర్తుచేశారు. ఆ సమయంలో ఆమె పాఠశాలకు వెళ్లే సమయంలో అదనంగా మరో చీర వెంట తీసుకెళ్లే వారని, ఎందుకంటే ఆమె నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్థులు ఆమెపై తరచూ చెత్త వేసేవారని చెప్పారు. నాటికీ నేటికీ పరిస్థితులు చాలా మారాయని సీజేఐ వెల్లడించారు. దాడులు, హింస, ఇతరులను అగౌరపర్చడం ద్వారా ఒకరు తమ ఆధిపత్యం చూపించుకోగలమనుకోవడం పొరబాటేనని సీజేఐ అన్నారు. సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం ఉన్నవారే, మానవత్వంతో ప్రవర్తించేవారే నిజంగా బలవంతులని తెలిపారు. ప్రజాదరణతో మాత్రమే ఎవరూ విజయాన్ని సొంతం చేసుకోలేరని, మన లక్ష్య సాధన పట్ల కృతనిశ్చయంతో ఉన్నప్పుడు విజయం లభిస్తుందన్నారు.

జడ్జీలు సందేశాలు ఇవ్వొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: తాము వెలువరించే తీర్పుల్లో జడ్జీలు వ్యక్తిగత అభిప్రాయాలు వెల్లడించడం కానీ, ఉపదేశాలివ్వడం కానీ చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టంచేసిందిప. లైంగిక కోర్కెలు నియంత్రించుకోవాలంటూ కిశోరప్రాయ బాలికలకు, మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని కిశోరప్రాయ బాలురకు ఓ తీర్పులో కలకత్తా హైకోర్టు సూచించడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుపట్టింది. ఇవి అనవసరమైన, తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలని జస్టిస్ అభయ్ ఎస్.ఓక్, జస్టిస్ పంకజ్ మిట్టల్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మండిపడింది. రాజ్యాంగ అధికరణం 21 ప్రకారం ఇటువంటి వ్యాఖ్యలు కిశోరప్రాయుల హక్కుల ఉల్లంఘన పరిధిలోకి వస్తాయని తెలిపింది. తదుపరి విచారణను జనవరి 4వ తేదీకి వాయిదా వేసింది. వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేసేందుకు ఒక మహిళను కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడికి పోక్సో చట్టంలోని 6 సెక్షన్ ప్రకారం శిక్ష విధించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన కేసులో కలకత్తా హైకోర్టులోని జస్టిస్ చిత్తరంజన్ దాస్, జస్టిస్ పార్థసారథి సేన్ ధర్మాసనం ఈ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసింది. వీటిని భారత ప్రధాన న్యాయమూర్తి సుమోటాగా విచారణకు చేపట్టారు.

నీ అసమర్థత టీడీపీకి అంటగడతావా?
జగన్‌పై అచ్చెన్నాయుడు అసహనం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రభుత్వ అసమర్థత ఏది బయటపడ్డా దాన్ని చంద్రబాబు, టీడీపీకి అంటగట్టడం జగన్ పార్టీకి అలవాటైందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు విమర్శించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు కొట్టుకుపోవడానికి టీడీపీ గత ప్రభుత్వమే కారణమని సీఎం తన సొంత పత్రికలో కథనం రాయడాన్ని ఖండించారు. ప్రాజెక్టుల నిర్వహణను జగన్ గాలికొదిలేశారు. ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులకు నోచుకోవడం లేదని వ్యాఖ్యానించారు. రైతులు, మీడియా గగ్గోలు పెట్టినా పట్టించుకోలేదన్నారు. గతంలోనే గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు ఒకటి ఊడింది..ఇప్పుడు మరొకటి ఊడింది. కనీసం గేట్లకు గ్రీజ్ కూడా పెట్టడం లేదు. ఏ ప్రాజెక్టు ఎలా ఉందో చూడకుండా గుడ్డెద్దుబోయి చేలో పడ్డట్టు ఇంకా చంద్రబాబుపై ఏడుపులు ఎందుకు.? క్యూసెక్కుకు, టీఎంసీకి తేడా తెలియని వారు నీటిపారుదల మంత్రులను చేస్తే ఇలానే ఉంటుంది. టీ, సమోసాలకు ఇచ్చిన ప్రాధాన్యత ఒక్క టీఎంసీ నీటిని కాపాడటంపై పెట్టండి. అసలే వర్షాలులేక ప్రాజెక్టులు నిండుకున్నాయి.. జగన్ సోమరితనంతో గేట్లు ఊడి నీళ్లన్నీ వృథా అవుతున్నాయి. గతంలో పులిచింతల ప్రాజెక్టు రాజశేఖర్ రెడ్డి పూర్తి చేశాడని చెప్పారు కానీ గేటు కొట్టుకుపోవడానికి మాత్రం చంద్రబాబే కారణమన్నారు. 2008లో రాజశేఖరరెడ్డి గుండ్లకమ్మను పూర్తి చేశారని చెప్పి, గేటు కొట్టుకుపోవడానికి మాత్రం చంద్రబాబు కారణమంటున్నారు. అన్నమయ్య గేటు కొట్టుకుపోయి రెండేళ్లు అయినా సరైన మరమ్మతులు లేవు. ప్రాజెక్టులో మిగిలిన గేట్లకు మరమ్మతులతో పాటు, ఇతర ప్రాజెక్టుల నిర్వహణపైనా సీఎం సమీక్షలు చేసి పనులు చేపట్టాలి' అని అచ్చెనాయుడు పేర్కొన్నారు.

ఎన్నికల ఎత్తుగడతోనే గ్రూప్ నోటిఫికేషన్లు
ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ ప్రభుత్వం రాబోయే ఎన్నికల దృష్టిలో ఉంచుకునే గ్రూప్ 1, గ్రూప్ 2 నోటిఫికేషన్లు విడుదల చేసిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ప్రభుత్వం ఉద్యోగాల పేరుతో డ్రామా ఆడుతోందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగున్నర సంవత్సరాలు కావస్తున్నప్పటికీ, ఇన్నేళ్లపాటు నోటిఫికేషన్లు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. ఇంతకాలం కాలయాపన చేసి, ఇప్పుడు ఎన్నికల ముందు ఉద్యోగ నోటిఫికేషన్లు హడావుడీగా విడుదల చేసి, ఓట్ల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే డీఎస్సీ నోటిఫికేషన్ ఎందుకు విడుదల చేయలేదన్నారు. విశ్వవిద్యాలయాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, రోస్టర్ పాటించకుండా రాజకీయం చేయాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ మార్చి 17న, గ్రూప్-2 ప్రిలిమ్స్ ఫిబ్రవరి 25 జరుగుతాయని ఏపీపీఎస్సీ ప్రకటించిందని గుర్తుచేశారు. అనంతరం మెయిన్స్‌కు మూడు నుంచి ఆరు నెలల సమయం ఇచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంలో ప్రిలిమ్స్ మాత్రమే జరుగుతాయని, ప్రిలిమ్స్ ఫలితాలు ఎన్నికలు తర్వాతే వచ్చే అవకాశం ఉందన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసి కనీసం విద్యార్థులకు సరైన సమయం ఇవ్వకుండా వేగవంతంగా పరీక్షలు ఏర్పాటు చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రస్తుతం వైసీపీ అధికారంలో పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత ప్రభుత్వం మారితే విద్యార్థుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. తక్షణమే విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని మెగా డీఎస్సీ విడుదల చేయాలని, విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు రోస్టర్ పాటించి ఎలాంటి అవకతవకలు పాల్పడకుండా సక్రమంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే అభ్యర్థులను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

త్యాగనిరతికి మరోపేరు సోనియా
గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ నిస్వార్థ ప్రజాసేవకురాలని, త్యాగనిరతికి మరోపేరని కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు కొనియాడారు. అతిక్లిష్ట సమయంలో ఏఐసీసీ అధ్యక్షురాలిగా కాంగ్రెస్ పార్టీని ఏకతాటిపై ముందుకు నడిపించిన నాయకురాలు సోనియా అని తెలిపారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం రుద్రరాజు నాయకత్వంలో సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనికి రాష్ట్ర కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీరామమూర్తి అధ్యక్షత వహించారు. రుద్రరాజు మాట్లాడుతూ సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని విజయపథంలో నడిపిస్తామని పునరుద్ఘాటించారు. సోనియాగాంధీ పుట్టినరోజు పురస్కరించుకుని భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆ తర్వాత నిర్మల్ హృదయ భవన్‌లో పండ్లు పంపిణీ చేశారు. విజయవాడ సమీపంలోని కానూరులో అమీన్‌బాయ్ అధ్వర్యంలో నిర్వహించిన వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమంలో రుద్రరాజు పాల్గొని వృద్ధులను పరామర్శించారు.

వైసీపీకి ఓట్ల తొలగింపే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పేదలకు సంక్షేమం కాదు ఓట్ల తొలగింపే వైసీపీ లక్ష్యమని మాజీ మంత్రి కిమిడి కళావెంకట్రావు శని వారం ఒక ప్రకటనలో విమర్శిం చారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతో తాడేపల్లి ప్యాలెస్‌లో నిద్రలేని రాత్రులు గడుపుతూ రాజ్యాంగ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఓట్ల జాబితాలో అక్రమా లకు పాల్పడుతున్నారని సీఎం జగన్‌పై ఆరోపణలు చేశారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ప్రతి నియోజకవర్గంలో లక్ష్యాలు పెట్టి ప్రతిపక్షాల ఓట్లు తొలగించే కుట్రలకు తెరతీశారని విమర్శిం చారు. 'పోలింగ్ కేంద్రాల్లో ప్రతిపక్ష ఓటర్లను ఇష్టానుసారం మార్చేశారు. ఏ బూత్‌లో చూసినా బోగస్ ఓట్లే ఉన్నాయి.

రాజస్థాన్, మిజోరం ఫలితాలపై కాంగ్రెస్ సమీక్ష

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధిష్ఠానం శనివారం రాజస్థాన్, మిజోరంలో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రదర్శనపై వేర్వేరుగా సమీక్షలు నిర్వహించింది. ఢిల్లీలోని ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కేంద్ర కార్యాలయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికర్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో సహా సీనియర్లు పాల్గొన్నారు. తొలుత మిజోరం ఆపై రాజస్థాన్‌కు సంబంధించిన సమావేశాలు జరిగాయి. రాజస్థాన్‌పై సమీక్షలో మాజీ సీఎం అశోక్ గెహ్లాత్ హాజరయ్యారు. సమావేశం అనంతరం ఏఐసీసీ ఇంచార్జి (రాజస్థాన్) సుఖ్‌జిందర్ సింగ్ రంధావా విలేకరులతో మాట్లాడుతూ గతంలో కంటే ఓట్లు పెరిగినప్పటికీ బీజేపీ కంటే తగ్గాయని అన్నారు. ఓట్లలో స్వల్పతేడాతో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయినట్లు చెప్పారు. నేటి నుంచే పార్లమెంటరీ ఎన్నికలకు ఏర్పాట్లు మొదలు పెడదామని సీనియర్లతో చెప్పామన్నారు.ఆత్మపరిశీలన చేసుకొని జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకుందామన్నారు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఐక్యంగానే ఎన్నికల్లో పోటీ చేసిందని చెప్పారు. చాలా కాలం తర్వాత రాష్ట్రంలో పార్టీ మెరుగైన ప్రదర్శన ఇచ్చిందని అధిష్ఠానం భావించిందన్నారు. రాజస్థాన్ ఇంచార్జిగా తప్పుకుంటారనా అనే ప్రశ్నకు ఎన్నికల వరకే ఉంటానని ముందే అధిష్ఠానానికి చెప్పాను. నేను పంజాబ్‌పైనా దృష్టి పెట్టాల్సి ఉందని రంధావా జవాబిచ్చారు. ఏఐసీసీ ఇంచార్జి (మిజోరం) భక్త్ చరణ్ దాస్ మాట్లాడుతూ మిజోరం ఎన్నికలకు సంబంధించిన అన్ని అంశాలను చర్చించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయితో పాటు రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగత కార్యాచరణనూ చర్చించామన్నారు. భవిష్యత్ ప్రణాళికలపై సమాలోచనలు జరిపినట్లు వెల్లడించారు.

2047కి అగ్రదేశంగా భారత్
వికసిత్ భారత్ సంకల్పయాత్రలో నిర్మలా సీతారామన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేశ ప్రజలందరి సహకారంతో భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రమిస్తున్నారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. దేశంలో ప్రతి వ్యక్తిలో, ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబంలో కొత్త ఉత్సాహం తీసుకురావడం ద్వారా అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం రాయనపాడులో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. అనంతరం కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, దగ్గుబాటి పురందేశ్వరి, కలెక్టర్ ఢిల్లీరావు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ మోదీ ఒక్క పథకం ప్రారంభిస్తే ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. జన్‌ధన్ ఖాతాల ద్వారా దేశంలో అందరికీ బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. ప్రతి పంచాయతీ పరిధిలో ప్రజలు ఈ రథం ద్వారా పథకాల సమాచారం తెలుసుకోవచ్చు. ప్రజలకు అర్హత ఉండి పథకం రాకుంటే... వెంటనే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. 17 రకాల పథకాలు గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం మోదీ అమలు చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ఐదు లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. కోవిడ్ నుంచి ఉచిత బియ్యం ఇస్తున్నాం. మోదీ మరో ఐదేళ్లు ఇది పెంచారు. రైతుల కోసం పీఎం కిసాన్ ద్వారా ఆరు వేలు ఇస్తున్నారు. ఎరువుల బస్తా రెండు వేలు విలువ చేసేది రూ.266కే రైతులకు అందిస్తున్నారు. పీఎం విశ్వకర్మ పేరుతో చేతి వృత్తుల వారిని మోదీ ప్రోత్సహించారని నిర్మలా సీతారామన్ వివరించారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. కరోనా సమయంలో లాక్‌డౌన్ దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని నిర్మలా సీతారామన్‌ను రాష్ట్రమంత్రి డాక్టర్ తానేటి వనిత కోరారు. ఈ మేరకు మంత్రికి వివరాలు తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు.

ఎంపీ భవంతి కోసం రోడ్డు మూసేస్తారా?
జనసేన నాయకుల అరెస్టు అక్రమం: నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ వైసీపీ ఎంపీ నిర్మాణం చేస్తున్న రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు వాస్తుదోషం ఉందని ప్రజలు నడిచే దారిని మూసేయడం దుర్మార్గమైన చర్య అని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. ప్రజలు స్వేచ్ఛగా ప్రయాణించే రోడ్లను కూడా మూసేస్తారా అని ప్రశ్నించారు. విశాఖపట్నంలోని టైకూన్ జంక్షన్‌లో వైసీపీ ఎంపీ నిర్మిస్తున్న అతిపెద్ద భవంతికి వాస్తు దోషం పేరిట అక్కడున్న ప్రధాన మార్గాన్ని మూసివేయడంపై శనివారం స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు టైకూన్ జంక్షన్‌లో నిరసన తెలిపారు. వారిని పోలీసులు అరెస్టు చేసి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఉత్తరాంధ్ర పర్యటనలో ఉన్న నాదెండ్ల మనోహర్ స్పందించి పోలీస్‌స్టేషన్‌కు స్వయంగా వెళ్లి అక్కడ అధికారులతో మాట్లాడారు. ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏం తప్పు చేశారని జనసేన నాయకులను అరెస్టు చేశారో వివరణ ఇవ్వాలని కోరారు. పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు అంటూ పోలీసులు చెప్పడంపై మనోహర్ విస్మయం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులు చేయడం దారుణమని, వెంటనే నాయకులను విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ భూదందాలపై వచ్చే ప్రభుత్వంలో సమగ్ర విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. విశాఖలో టైకూన్ కూడలిని మూసేసి మరీ ప్రజాప్రతినిధి భవనానికి అధికారులు సహకరించడం ఘోర తప్పిదమన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపు తుంటే అక్రమంగా అరెస్టు చేయడమే కాకుండా, రోడ్డుపై మహిళలను ఈడ్చిపడేయడం ఏమిటని, ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా అని ప్రశ్నించారు. టైకూన్ జంక్షన్ మూసివేతపై పవన్ కల్యాణ్ స్పందించిన అనంతరం విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కూడా అధికారులకు వినతిపత్రం ఇచ్చినట్టు హడావుడి చేశారని, ఆ తర్వాత నగరపాలక అధికారులు, పోలీసు అధికారులు దీనిపై స్పందించలేదని ఆయన తెలిపారు. ఇప్పటికీ ఆ సమస్య అలాగే ఉందని అన్నారు. టైకూన్ కూడలి మూసివేతతో లబ్ధి పొందే అదృశ్య శక్తి ఎవరో తెలియాలన్నారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించి టీడీఆర్ పేరుతో రూ.63 కోట్లు కొట్టేశారని ఆరోపించారు. అరెస్టయిన వారిలో కార్పొరేటర్ మూర్తి యాదవ్, కోనా తాత రావు ఉండగా, నాయకులు శివశంకర్, పంచకర్ల రమేష్ బాబు, సందీప్, ఉష కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.